ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 8 ఫిబ్రవరి 2025





# అట్టహాసంగా ఆలపాటి నామినేషన్

8

- జనసంద్రంగా గుంటూరు నగరం
- మూడు పార్టీల నేతలతో ప్రదర్శనగా కలెక్టరేట్‌కు
- సంఘీభావంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నేతలు

కలెక్టర్‌కు నామినేషన్ పత్రం అందజేస్తున్న పట్టభద్రులు ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మంత్రులు మనోహర్, పార్థసారథి, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, బీజేపీ ఎమ్మెల్యే కామినేని

# టీడీఆర్ అవినీతి.. రూ.10 కోట్లు

- రాష్ట్ర ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక
- అక్రమాల్లో 10 మంది టౌన్‌ప్లానింగ్ అధికారుల పాత్ర
- డోర్ నెంబర్లు మార్చి అధిక విలువతో బాండ్లు జారీ
- గుంటూరు, మంగళగిరి, చిలకలూరిపేట, చీరాలలో అక్రమాల గుర్తింపు
- వైసీపీ హయాంలో నేతల మాటలకు పెద్దపీట వేసి ఖజానాకు గండి

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

రోడ్ల విస్తరణ జరగలేదు.. కానీ ఇల్లు, స్థలాలు కోల్పోయిన వారికి జారీచేసే టీడీఆర్ బాండ్స్ వ్యవహారంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయి. నగర పాలక సంస్థ, పురపాలక సంఘాల్లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గత వైసీపీ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన నేతల మాటలకు పెద్దపీట వేసిన అధికారులు ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టారు. ఈ విషయాన్ని విజిలెన్స్ నిర్ధారించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, 10 మున్సిపాలిటీల్లో రూ.10 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు తేల్చింది. గడచిన ఐదేళ్ల కాలంలో కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలి ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టినట్లు తేల్చారు. రోడ్డు అభివృద్ధి ప్రణాళిక (ఆర్‌డీపీ) లేకుండానే టీడీఆర్ బాండ్లు జారీ చేసినట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో 10 మంది టౌన్‌ప్లానింగ్ అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. వారికి ఇప్పటికే విజిలెన్స్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే గడువు ముగిసినా ఆ అధికారులు విచారణకు హాజరు కాలేదని సమాచారం.

## ఒక్కోచోట ఒక్కోలా..

గుంటూరు, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లతో పాటు, 10 మున్సిపాలిటీలలో మొత్తం 750 టీడీఆర్ బాండ్లు జారీ అయ్యాయి. వాటిని జారీ చేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఒక్కో చోట ఒక్కో విధానాన్ని అమలు చేశారు. 2020 అక్టోబరు 1న టీడీర్ బాండ్లు జారీ సమయంలో రోడ్డు అభివృద్ధి ప్రణాళికను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం జీవో జారీ చేసింది. గుంటూరు, చీరాల, చిలకలూరిపేటల్లో ఈ జీవోను పూర్తిగా పక్కన పెట్టి



చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయం

బాండ్లు జారీచేశారు. మార్కెట్ విలువ తక్కువగా ఉన్న చోట ఎక్కువగా ఉన్నట్లు చూపించి ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు అధికారులు లోపాయికారి ఒప్పందం చేసుకుని అక్రమాలకు పాల్పడ్డారు. అసలు రోడ్డు అభివృద్ధి ప్రణాళిక లేని చోట బాండ్లు జారీ వల్ల ప్రజాధనం దుర్వినియోగమైందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గుంటూరు, మంగళగిరి, చిలకలూరిపేట, చీరాలలో చాలా చోట్ల రోడ్డు అభివృద్ధి ప్రణాళికలు ఇంత వరకు రూపొందించలేదు. అయినా ఆయా మున్సిపాలిటీల్లో ఇష్టం వచ్చినట్లు టీడీఆర్ బాండ్లు ఇచ్చేశారు. ఇబ్బడిముబ్బడిగా బాండ్లు జారీ వల్ల రూ.10 కోట్ల వరకు ప్రజాధనం దుర్వినియోగమైనట్లు తేలింది.

## రూ.9 వేలకు రూ.20 వేలు

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని పందుల కాలనీలో డోర్ నెంబర్లు తప్పుగా వేసి టీడీఆర్ బాండ్లు జారీ చేశారు. ఇక్కడ మార్కెట్ విలువ గజం రూ.9 వేలు ఉంది. ఆ మేరకు టీడీఆర్ బాండ్‌ను జారీ చేయాల్సి ఉండగా, కిలోమీటరు ముందుకు వచ్చి స్థలం విలువ గజం రూ.20 వేలు ఉన్నట్లు చూపించి బాండ్‌ను జారీ చేశారు. 5400 చదరపు గజాల స్థలానికి బాండ్లు జారీ అయ్యాయి. దానివల్ల ఇక్కడ ఒక్క చోట రూ.5.85 కోట్లు వరకు ఖజానాకు నష్టం జరిగిందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు.



# ఆధార్ నో మోదు

- పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేక ఆగిన ప్రక్రియ
- ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినా సా..గుతున్న వైనం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు.. ధ్రువీకరణపత్రాలు లేక జాప్యం
- నమోదు కాని పిల్లలు 80 వేల మంది

**ఆధార్.. అందరికీ అవసరం. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆధార్ తప్పనిసరి. అది లేకపోతే ఏ పని జరగలేదు. ప్రభుత్వ పథకాల లబ్ధి జరగాలన్నా.. పాఠశాలల్లో చేరలన్నా.. ప్రయాణాల్లో రిజర్వేషన్ సమయాల్లో ఆధార అవసరం ఉంది. అయితే గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో 80 వేల మంది చిన్నారులకు ఆధార్ నమోదు కాలేదు. తల్లిదండ్రుల్లో అవగాహన లేమి.. మొదట్లో నిర్లక్ష్యం.. ఆ తర్వాత జనన ధ్రువీకరణపత్రాలు పొందలేక పిల్లలకు ఆధార్ నమోదు కాలేదు. ఇక ప్రభుత్వ పరంగా ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసిన గుర్తించిన చిన్నారులకు తప్పనిసరిగా నమోదు చేయించాలని సూచించినా జాప్యం జరుగుతోంది. గత ఏడాది డిసెంబరు 31కు గుర్తించిన ఆరేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు పూర్తి చేయాల్సి ఉన్నా.. ప్రక్రియ ఇంకా కొనసా...గుతూనే ఉంది.**

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎంతో ముఖ్యం.. అవసరమైన ఆధార్ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 80 వేల మంది పిల్లలకు లేదు. వీరిలో ఎక్కువ మంది 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన వారే ఉన్నారు. వీరు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరాలన్నా ఆధార్ తప్పనిసరి అవడంతో వారు అడ్మిషన్లు పొందలేకపోతున్నారు. ఆధార్ లేని పిల్లలకు ప్రభుత్వ పథకాలు అందవని అధికారులు చెబుతున్నారు. అయితే తల్లిదండ్రుల అవగాహన లేమి.. నిర్లక్ష్యం కారణంగా పిల్లలకు ఆధార్ నమోదు కాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను సులభతరం చేసింది. అయినా గత ఏడాది డిసెంబరు 31 నాటికే పూర్తి కావాల్సిన ప్రక్రియ ఇంకా కొనసా...గుతూనే ఉంది. బిడ్డ పుట్టిన వెంటనే ఆధార్ నమోదుకు అవకాశం ఉంటుంది. బిడ్డ పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకుంటే తల్లి వేలిముద్రతో ఆధార్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అయినా గుంటూరు జిల్లాలో 23,774 మంది, పల్నాడు జిల్లాలో 39,755 మంది, బాపట్ల జిల్లాలో 16,552 మంది పిల్లలకు ఇప్పటి వరకు ఆధార్ రాలేదు. వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించిన ప్రసవాల నివేదిక ఆధారంగా ఆధార్ లేని పిల్లల సంఖ్యను గుర్తించారు. ఎక్కువ మంది 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన వారే ఉండటం వల్ల చివరకు అంగన్‌వాడీ పాఠశాలలో కూడా చేర్పుకోని పరిస్థితి నెలకొంది.

## పుట్టిన తేదీ సర్టిఫికెట్ అంటే తెలియదు..

ఆధార్‌లేని పిల్లల తల్లిదండ్రులకు అసలు పుట్టిన తేదీ సర్టిఫికెట్ అంటే ఏమిటో తెలియదని తెలుస్తోంది. దానివల్ల వారు ఇంతవరకు తమ బిడ్డలకు ఆ సర్టిఫికెట్ తీసుకోలేదని చెబుతున్నారు. వాస్తవానికి అన్ని ప్రసవాలు ఆస్పత్రిలోనే జరుగుతున్నా తల్లిదండ్రుల అవగాహన లేమి వల్ల అప్పట్లో పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకోకపోవడం శాపంగా మారింది. ఇప్పుడు అదే సర్టిఫికెట్ కోసం వెళ్తుంటే నానా ఇబ్బందులు ఎదురౌతున్నాయి. బిడ్డకు ఆధార్ రావాలంటే పుట్టిన తేదీ సర్టిఫికెట్ దరఖాస్తుకు జత పర్చాల్సి ఉంటుంది. మొన్నటి దాకా పుట్టిన తేదీ సర్టిఫికెట్ మంజూరు చేసే విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. గడువు దాటిన సర్టిఫికెట్లు తహసీల్దార్ మంజూరు చెయ్యాల్సి రావడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

## ప్రత్యేక ఆధార్ కేంద్రాలు..

ఆధార్ లేకపోతే పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటారని భావించిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆరేళ్ల వయస్సు కలిగి ఇంకా ఆధార్ పొందని వారి కోసం ప్రత్యేక కేంద్రాలను తెరిచింది. గుంటూరు నగరంలో సుమారు 64 ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### ఇప్పుడు వైద్యులు చాలు..

ప్రభుత్వం 0-6 సంవత్సరాల వయస్సు కలిగిన పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియలో కొన్ని మార్పులు చేసింది. తహసీల్దారు చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ప్రసవం జరిగిన చోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇచ్చే సర్టిఫికెట్ ఆధారంగా ఆధార్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. వాటిని కూడా పరిగణనలోకి తీసుకునే విధంగా నిబంధనలు సడలించారు. అయితే చాలామంది ప్రైవేటు వైద్యశాలల్లో ప్రసవమయ్యారు. ప్రస్తుతం అటువంటి జననాలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ జారీ చేసే విషయంలోనే సమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది.

### మహిళా పోలీసులదే బాధ్యత..

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఆధార్‌లేని 80 వేల మంది పిల్లల డేటా సచివాలయాల్లోని మహిళా పోలీసులకు ఇచ్చాం. వారు ఆ డేటా ఆధారంగా తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పుట్టిన తేదీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపడతారు. ప్రతి మండలంలో నాలుగైదు సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలకు ఆధార్ ఉందో, లేదో చూసుకుని లేకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. - చొప్పర కృష్ణ, జడ్పీ డిప్యూటీ సీఈవో, జిల్లా సచివాలయాల అధికారి



# తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు

- కోటప్పకొండలో ప్రసాదం కౌంటర్లు పెంచాలి
- పనులను పరిశీలించిన కలెక్టర్ అరుణ్‌బాబు

కోటప్పకొండ(నరసరావుపేట), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే తిరునాళ్లలో భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. తిరునాళ్లలో చేపట్టిన పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల నియమావళికి లోబడి ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రసాదం విక్రయ కౌంటర్లను పెంచాలన్నారు. ఎక్కడికక్కడ సైన్ బోర్డులు ఏర్పాటు చేసి భక్తులకు సమాచారం అందించాలన్నారు. భక్తుల సౌకర్యార్థం కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. కొండ మీద ప్రత్యేకంగా మొబైల్ టవర్లు ఏర్పాటు చేయాలని బీఎస్ఎన్ఎల్ అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్డు, మెట్ల మార్గంలో కోతుల బెడద నివారించాలన్నారు. లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పరిసర గ్రామాల నుంచి వచ్చే ప్రభల మార్గంలో హై టెన్షన్ విద్యుత్ తీగలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్‌ధనుంజయ్ గనోరె, డీఆర్వో మురళి, కోటప్పకొండ దేవాలయ ఈవో డీ చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.



కోటప్పకొండలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఈవో చంద్రశేఖరరావు, జేసీ సూరజ్

# పశువులకు నైట్రేట్ ముప్పు

- ప్రమాదంలో మూగజీవాల ప్రాణాలు
- తాగే నీటి ద్వారా దేహంలోకి మూలకం
- పొన్నూరు, తెనాలిలో హానికర స్థాయిలో నిల్వలు
- ఆవులు, గేదెల్లో కిడ్నీ ఫెయిల్యూర్, సంతాన లేమి కేసులు
- అన్ని మండలాల్లో నీటి నమూనాలు సేకరిస్తున్న పశుసంవర్ధక శాఖ



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కిడ్నీలు విఫలమై జబ్బు పడుతున్న మూగజీవాలు.. ఆవులు, గేదెల్లో సంతానలేమి.. ఇలా పశుసంపద ప్రమాదంలో పడుతోంది. తాగే నీటి ద్వారా పశువుల దేహంలోకి ప్రవేశిస్తున్న నైట్రేట్ మూగజీవాల ప్రాణం మీదకు తెస్తుంది. పొన్నూరు, తెనాలి నియోజకవర్గాల్లో గేదెలు, ఆవులు తాగుతున్న నీటిలో హానికర స్థాయిలో నైట్రేట్ నిల్వలు ఉన్నట్లు తేలింది. ఈ ప్రభావంతో పశువుల్లో కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు పెరగడం, సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గడం, చివరకు ప్రాణాలు సైతం పోయే పరిస్థితి పొంచి ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ గుర్తించింది. పొన్నూరు మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన పశువులు సరిగా మేత మేయకపోవడం, నీరు తాగకపోవటం వంటి లక్షణాలతో వస్తూ ఉండటం పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ కేశవరావు గమనించారు. అనుమానం వచ్చి అక్కడున్న పశువులకు కిడ్నీ పరీక్షలు చేయించగా ఇబ్బందికరమైన ఫలితాలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన ఏడీఏ గ్రామంలో పశువులు తాగుతున్న నీటిని సేకరించి పరీక్షల నిమిత్తం పంపగా మోతాదుకు మించిన స్థాయిలో నైట్రేట్ ఉన్నట్లు తేలింది. పొన్నూరు మండలం నిడుబ్రోలు, మాచవరం, తెనాలి మండలం అంగలకుదురు, ఖాజీపేట, పినపాడు తదితర గ్రామాల్లో పశువులు పదేపదే తిరగ కడుతుండటంతో అనుమానం వచ్చిన అధికారులు అక్కడ నీటిని కూడా సేకరించి విజయవాడలోని వెటర్నరీ బయోలాజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పరీక్షల నిమిత్తం పంపారు. అక్కడ జరిపిన పరీక్షల్లో ఆయా ప్రాంతాల్లోని నీటిలో నైట్రేట్ నిల్వల శాతం 245 పీపీఎం

(మిగతా 8వ పేజీలో

# పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్

- జిల్లా వ్యాప్తంగా 62 కేంద్రాలు ఏర్పాటు
- విధివిధానాలపై సమీక్షలో డీఐఈవో నీలావతిదేవి

నరసరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో నీలావతిదేవి తెలిపారు. పరీక్షల నిర్వహణపై అధ్యాపకులతో విట్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం తగదన్నారు. కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అవకతవకలకు తావులేకుండా సజావుగా, ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణకు 62 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 10 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. 13,749 మంది విద్యార్థులు ప్రాక్టికల్‌కు హాజరు కానున్నారన్నారు. ప్రాక్టికల్స్ మార్కులు, విధి విధానాలపై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో నీలావతి దేవి

# గృహయోగం ఎప్పటికో..?

- ఇళ్లలో చేరకుండానే ఈఎంఐలు చెల్లింపు
- జాబితాలో 284 మంది లబ్ధిదారుల పేర్లు తొలగింపు
- నరసరావుపేటలో మున్సిపల్ ఖాతాలోనే వారి సొమ్ము

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మున్సిపల్ పరిధిలోని పేదలకు గృహయోగం కలగడంలేదు. టిడ్కో ప్రాంగణంలో అన్ని వసతులు కల్పించినా ఇళ్ల పంపిణీలో నిర్లక్ష్యం అలుముకుంది. కూటమి ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీకి నోచుకోవడంలేదు. పేదలకు గృహాలు ఎప్పటికి పంపిణీ చేస్తారనే విషయంపై అధికారులకే స్పష్టత లేదు. సొంత ఇంటి కోసం ఏళ్ల తరబడి లబ్ధిదారులు ఎదురు చూస్తున్నా వీరి మొర ఆలకించే వారే కరువయ్యారు. నరసరావుపేటలో 2018లో 1504 టిడ్కో గృహాలను నిర్మించారు. వైసీపీ ఐదేళ్ల ఇళ్లను పంపిణీ చేయడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇళ్ల పంపిణీ చేస్తారన్న లబ్ధిదారుల ఆశ అడియాసగానే మారింది. ఇళ్ల పంపిణీలో ఇంకా నిర్లక్ష్యం కొనసాగుతోంది. సొంత ఇల్లు ఉన్నా లబ్ధిదారులు అద్దె గృహాలలో నివసిస్తూ ఆర్థిక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

## రూ.1.42 కోట్లు చెల్లింపుపై మీనమేషాలు

వైసీపీ హయాంలో 284 లబ్ధిదారుల పేర్లను జాబితా నుంచి తొలగించారు. వారిస్థానంలో వైసీపీ వర్గీయులకు ఇళ్ల కేటాయించారు. ఆ సమయంలో ఒక్కొక్కరి నుంచి రూ.25 వేలను లబ్ధిదారుని వాటాగా మున్సిపాల్టీ స్వీకరించింది. అయితే గతంలో తొలగించిన లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.50 వేలు వాటా ధనంగా చెల్లించారు. వీరికి ఇంటిని రద్దు చేశారు. వారు చెల్లించిన సొమ్మును తిరిగి ఇవ్వలేదు. 2018 నుంచి 284 లబ్ధిదారుల సొమ్ము మున్సిపాల్టీ వద్దే ఉంది. రూ.1.42 కోట్లు తిరిగి చెల్లించడాన్ని అధికారులు విస్మరించారు. ఈ మొత్తంలో మున్సిపాల్టీ ఖాతాలో రూ.84 లక్షలు, టిడ్కో ఖాతాలో రూ.58 లక్షలు ఉన్నట్లు సమాచారం. ఇల్లు కేటాయించని పక్షంలో తాము చెల్లించిన రూ.50 వేలు తిరిగి ఇవ్వాలని బాధితులు కోరుతున్నా వారి మొర ఆలకించే వారే లేరు.

## 521 మందికే ఇళ్ల పంపిణీ

1504 గృహాలకు గాను ఇప్పటి వరకు 521 మంది లబ్ధిదారులకు మాత్రమే గృహాలను అప్పగించారు. ఇంకా 983 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అప్పగించాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. 809 మంది లబ్ధిదారుల పేర్లపై బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయి. ఇంటిలో నివాసం ఉండకుండానే లబ్ధిదారుల బ్యాంకు ఈఎంఐ చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికి 695 గృహాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగింది.



నరసరావుపేటలో పంపిణీకి నోచుకోని టిడ్కో గృహాలు

## ఎల్‌ఎల్‌బీ, బీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ ఫలితాల విడుదల

పెదకాకాని, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో గత అక్టోబరు నెలలో నిర్వహించిన ఎల్.ఎల్.బి, బీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ ఫలితాలను శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరీక్షల నిర్వహణ, నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. ఈ సందర్భముగా ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ మూడేళ్ల ఎల్ఎల్.బి , ఐదేళ్ల బీఏ ఎల్ఎల్ బీ హానర్స్, బీబీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ కోర్సులకు చెందిన పలు సెమిస్టర్‌ల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మూడేళ్ల ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 551 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 396 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఐదేళ్ల కోర్సులో 7వ సెమిస్టర్ పరీక్షలను 305 మంది విద్యార్థులు రాయగా 209 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు. రెండో సెమిస్టర్ పరీక్షలను 390 మంది విద్యార్థులు రాయగా 116 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఐదేళ్ల బీఏ ఎల్ఎల్. బి హానర్స్ కోర్సులో 26 మంది విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బీబీఏ ఎల్‌ఎల్‌బీ హానర్స్ కోర్సులో 25 మంది విద్యార్థులు రెండో సెమిస్టర్ పరీక్షలు రాయగా 21 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు పరీక్షల నిర్వహణాధికారి రెడ్డి ప్రకాశరావు మాట్లాడుతూ రూ. 1860 చెల్లించి పునః మూల్యాంకనంకు దరఖాస్తు చేసు కోవడానికి ఫిబ్రవరి 25వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫలితాల వివరాలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధికారిక వెబ్సైట్‌లో పొందవచ్చని పేర్కొన్నారు.

## ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి



ఆలపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రులు అనగాని, గొట్టిపాటి రవి

రేపల్లె, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలకు మద్దతుగా ఆలపాటి రాజాని గెలిపించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం గుంటూరులోని ఆయన నివాసంలో కూటమి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాని నామినేషన్ సందర్భంగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలపాటి రాజాని రెండు జిల్లాల వాసులు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. 2024 ఎన్నికల్లో శాసనసభలో ప్రక్షాళన జరిగిందనీ, ఇక శాసనమండలిలోను ప్రక్షాళన కోసం ఆలపాటి రాజా గెలుపు అవసరం అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, మాజీ జడ్పీ ఉపాధ్యక్షుడు పూర్ణ పాల్గొన్నారు.

## అనుమతులు ముగిసినా.. ఆగని తవ్వకాలు



గాజుల్లంక ఇసుక రీచ్‌లో శుక్రవారం రాత్రి లారీకి ఇసుక నింపుతున్న యంత్రం

- రాత్రివేళ యంత్రాలతో ఇసుక లోడింగ్
- పట్టించుకోని అధికారులు

కొల్లూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలకు సంబంధించి పర్యావరణ అనుమతులు ముగిసినప్పటికీ ఇసుక తవ్వకాలు రాత్రివేళ యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. బాపట్ల జిల్లా కొల్లూరు మండల పరిధిలో గాజుల్లంక వద్ద గత ఏడాది ప్రభుత్వం ఉచిత ఇసుక రీచ్‌కు అనుమతులు ఇచ్చింది. ఆయా అనుమతులు శుక్రవారం సాయంత్రం ఆరు గంటలతో ముగిసినా గుత్తేదారులు మాత్రం రాత్రింబవళ్లు ఇసుక తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు ముగుస్తున్నాయని మధ్యాహ్నం నుంచే ట్రాక్టర్లకు ఇసుక పోయడాన్ని నిలిపి వేశారు. అప్పటి నుంచి భారీ యంత్రాలతోనే నదిలో భారీ వాహనాలలో ఇసుకను లోడింగ్ చేశారు. సాయంత్రం 6 గంటలకు పర్యావరణ అనుమతులు ముగిసినా తవ్వకాలు మాత్రం గుత్తేదారులు ఆపలేదు. భారీ వాహనాలకు తెల్లవార్లు నదిలోని ఇసుకను యంత్రాలతో తోడి పోశారు. మరో నాలుగు రోజుల్లో అనుమతులు వచ్చే అవకాశం ఉన్నా, అప్పటి దాకా కూడా ఆగకుండా నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు చేయడం గమనార్హం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ఇసుక రీచ్‌లు గురువారం సాయంత్రం మూతపడ్డాయి. ఆయా మండలాల రెవెన్యూ అధికారులు గుత్తేదారులకు అనుమతులు ముగిసినట్లు నోటీసులు ఇవ్వడంతో పాటు నదిలో ఇసుక తవ్వే ప్రదేశానికి వెళ్లే మార్గాలను తవ్వించి ఇసుక తవ్వకాలకు ఆస్కారం లేకుండా అడ్డుకట్ట వేశారు. ఇక్కడ మాత్రం గుత్తేదారులకు అనుమతులు ముగిసినట్లు నోటీసులు ఇచ్చిన దాఖలాలు లేవు. పైగా మైనింగ్, రెవెన్యూ అధికారులు అనుమతులు ముగిసిన అనంతరం తీసుకోవాల్సిన చర్యలు లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంగా తెల్లవార్లు ఇసుకతో పాటు బుసక తవ్వకాలు నిరంతరంగా సాగించారు.

### ఆరు యూనిట్ల ఇసుక ధర రూ.8 వేలకు పెంపు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇసుక రీచ్‌లు మూత పడటంతో శుక్రవారం గాజుల్లంక రీచ్‌లో ఒక్కసారిగా ఇసుక ధరలు పెంచేశారు. నిన్నమొన్నటి వరకు ఆరు యూనిట్లు ఇసుక రూ.6 వేలకు, ఏడు యూనిట్లు రూ.6500-7000 వేల ధరకు లారీలకు లోడ్ చేశారు. శుక్రవారం మాత్రం గాజుల్లంక రీచ్ మాత్రమే ఇసుక తవ్వకాలు చేసేందుకు అనుమతులు ఉండటంతో ఇదే అదునుగా గుత్తేదారులు రూ.8 వేలకు ఇసుక ధరను పెంచి అమ్మకాలు సాగించారు.

### డంపింగ్ నిల్వలు పరిశీలన

కొల్లిపర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెంలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన ఇసుకరీచ్‌లు గడువు ముగియటంతో గురువారం సాయంత్రం ఆర గంటలకు మూతపడ్డాయి. దీంతో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని మున్నంగి, పిడపర్తిపాలెం, బొమ్మువానిపాలెం ఇసుకరీచ్‌ల్లో డంపింగ్ చేసిన నిల్వలను మైనింగ్ సర్వేయర్ సీతమ్మబాయ్, టెక్నికల్ అసిస్టెంట్ కావ్య, జూనియర్ అసిస్టెంట్ సల్మాన్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, విలేజ్ సర్వేయర్ మోహన్‌సాయి, శ్రీనివాసరావు, వీఆర్వోలు రామారావు, ఆనంద్ పరిశీలించారు. తహసీల్దార్ సిద్ధార్థ ఆదేశాల మేరకు డంపింగ్ నిల్వలను సంబంధిత వీఆర్వోలకు అప్పగించనున్నట్లు మైనింగ్ అధికారులు తెలియజేశారు.



బొమ్మువానిపాలెంలో డంపింగ్ చేసిన ఇసుకను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

## కలిసి పనిచేద్దాం.. అభివృద్ధిని సాధిద్దాం

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, ఆయన సతీమణి 30వ వార్డు కౌన్సిలర్ షకీలాతోపాటు 27వ వార్డు కౌన్సిలర్ హేమలత, 18వ వార్డు కౌన్సిలర్ పాల్వాది ప్రసన్నాంజనేయులు, 9వ వార్డు కౌన్సిలర్ రెడ్డి నాగపద్మ వైసీపీకి రాజీనామా చేసి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సమక్షంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కౌన్సిలర్లకు జీవీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో ఉండి ఎంతో ఆశతో పార్టీలో చేరామని, పార్టీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారం లేదని తెలిపారు. ఒక ట్రస్టీగా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. గతంలో అభివృద్ధి పేరిట అవినీతి జరిగిందనీ, జీవీ ఏ బాధ్యత ఇచ్చిన భార్యభర్తలం ఇద్దరం జన్మాంతరం పనిచేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కలిసి పని చేసి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందాం అన్నారు. పార్టీలో చేరిన కౌన్సిలర్లకు తప్పనిసరిగా గౌరవం ఉంటుందని అన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి చూసి పార్టీలోకి వస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతోపాటు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

## వివాహానికి వెళ్తూ దుర్మరణం

- బస్సు ఢీకొని ఇద్దరు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు

రాజుపాలెం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బస్సు ఢీకొని ఇద్దరు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. సేకరించిన సమాచారం మేరకు.. మండలంలోని కోటనెమలిపురి గ్రామానికి చెందిన సానికొమ్ము సుబ్బారెడ్డి(46), దేవిరెడ్డి శ్రీనివాస రెడ్డి(45) వరుసకు బావ, బావమరుదులు. క్రోసూరు మండలం పీసపాడు గ్రామంలో వారి బంధువుల ఇంట్లో శుక్రవారం రాత్రి వివాహం జరుగుతుంది. ఈ వివాహానికి హాజరయ్యేందుకు కోటనెమలిపురి గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. మార్గమధ్యలో రెడ్డిగూడెం గ్రామ సమీపానికి వచ్చేటప్పటికీ గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న మాచర్ల డిపోకు చెందిన ఏపీ 40జెడ్ 0240 నంబరు కలిగిన ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి తరలించారు. గుంటూరు నుంచి మాచర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సు మార్గమధ్యలోని రెడ్డిగూడెం దాటిన తరువాత ఎదురుగా వస్తున్న రెండు కార్లను, రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొనటంతో ఆ శబ్దానికి సమీపంలో ఉన్న వారు సంఘటనా స్థలానికి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఎస్సై వేణుగోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకే సంఘటనలో ఇద్దరుమృతి చెందటంతో కోటనెమలిపురి గ్రామంలో విషాదం నెలకొంది.





ప్రమాదానికి కారణమైన బస్సు

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి



ఇమ్రాన్‌వలి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్



మృతుడు ఇమ్రాన్‌వలి (ఫైల్)

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరైన ఎస్పీ, అధికారులు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సమీపంలో ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ షేక్ ఇమ్రాన్‌వలి శుక్రవారం మృతి చెందారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మృతుడి స్వగ్రామం మంగళగిరి పరిధిలోని నవులూరులో ఇమ్రాన్‌వలి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ తరపున లక్ష రూపాయల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించి, శాఖాపరంగా అందాల్సిన అన్ని ప్రయోజనాలను సకాలంలో అందించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఎప్పుడు ఏ ఆపద వచ్చినా కానిస్టేబుల్ ఇమ్రాన్ వలి కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఇమ్రాన్ వలి 2012లో కానిస్టేబుల్‌గా చేరి పలు పోలీస్ స్టేషన్లలో పనిచేసి, ప్రస్తుతం కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొబేషనరీ ఐపీఎస్ దీక్షా, మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు, తాడికొండ సీఐ వాసు, ఆర్ఐ శ్రీహరి రెడ్డి, మంగళగిరి రూరల్ ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు షైలా సాంబశివరావు, సెక్రటరీ లక్ష్మయ్య, పలువురు పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు,స్నేహితులు, బంధువులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ మృతి

కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శుక్రవారం మృతి చెందాడు. పిన్నెల్లి చంద్ర శేఖర్ 1983లో పోలీస్ విభాగంలో ఏపీఎస్‌పీ కానిస్టేబుల్‌గా చేరి, 2005లో ఏఆర్ కానిస్టేబుల్‌గా కన్వర్షన్ అయ్యి, తదుపరి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొంది ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. సుమారు 40 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలంగా పోలీస్ శాఖకు విశేష సేవలందించారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఏటీ అగ్రహారంలోని స్వగృహంలో ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు పోలీస్ విభాగం తరపున ఆర్ఐ శ్రీహరి రెడి, పోలీస్ అసోసియేషన్ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీస్ శాఖ తరపున రూ. లక్ష చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందించి, శాఖా పరంగా అందాల్సిన అన్ని ప్రయోజనాలను సకాలంలో అందించడానికి కృషి చేస్తామని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



మృతుడు శ్రీనివాస్ (ఫైల్)

చిట్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన యువకుడు చెవుల శ్రీనివాస్ (24) చిట్యాల మండల కేంద్రంలోని పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి పని నిమిత్తం బయటకు వెళ్లి పెట్రోల్‌బంకు వద్దకు తిరిగి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి శ్రీనివాస్ కిందపడిపోయాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి చిన్నమ్మ చెవుల ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

## ఆలపాటి గెలుపునకు కృషి చేయాలి

- ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి



సభలో మాట్లాడుతున్న జీవీరెడ్డి

కారంపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు కోసం కూటమి నేతలు కృషి చేయాలని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పద్మావతి ఫంక్షన్ హాలులో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. అనుభవజ్ఞుడైన రాజేంద్రప్రసాద్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతాభివృద్ధికి చర్యలు తీసుకొని, నిధులు మంజూరుకు కృషి చేస్తారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో ఆలపాటికి అత్యధిక మెజార్టీ తెప్పించి విమర్శకుల నోరు మూయించి ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, మునుగోటి సత్యం, కటికల బాలకృష్ణ, మస్తాన్ జాని, పంగులూరి లక్ష్మయ్య, క్లస్టర్ ఇన్‌చార్జిలు శ్రీనివాసరావు, ప్రభాకర్, జనసేన నేతలు బూసా రామాంజినేయులు, కృష్ణబాబు, బీజేపీ నేతలు నాసరయ్య, హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మాచర్ల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ తీసుకురావాలని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రమైన దుర్గిలోని సత్యసాయి కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## రూ.16 లక్షలు జరిమానా



ప్రకాష్ కుమార్, మైనింగ్ ఏడీ

దాచేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేకుండా, సరైన బిల్లులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న గ్రానైట్ లారీలకు రూ.16 లక్షలు జరిమానా విధించినట్టు దాచేపల్లి మైనింగ్ ఏడీ ప్రకాష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రకాశం జిల్లా మార్టూరు నుంచి, వినుకొండ నుంచి కారంపూడి, గురజాల, పులిపాడుల మీదుగా పొందుల సమీపంలోని రాష్ట్ర రహదారి మీదుగా తెలంగాణ రాష్ట్రంలోకి గ్రానైట్ రాళ్ల లారీలు తరలిపోతున్నాయని సమాచారం వచ్చినట్టు తెలిపారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, మైనింగ్ శాఖ అధికారులు సంయుక్త ఆధ్వర్యంలో బిల్లులు లేకుండా అక్రమంగా తరలిపోతున్న వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. నాలుగు లారీలను అదుపులోకి తీసుకున్నామన్నారు. డిసెంబరు నెలలో రూ.4 లక్షలు, జనవరి నెలలో రూ. 12 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. రాత్రి సమయాల్లో ఆయా శాఖల అధికారులు తనిఖీలు చేస్తుండటాన్ని గమనించిన కొన్ని లారీలు పగటి పూటనే నేరుగా తెలంగాణ రాష్ట్రానికి చేరుకుంటున్నాయని వివరించారు. ఈ సమాచారంతో పగటి పూట కూడా తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీ ప్రకాష్ కుమార్ స్పష్టం చేశారు.

## సీసీ కెమెరాల్లేని ప్రాంతాలే టార్గెట్..!

- ఆరు జిల్లాల్లో చోరీలు.. నెల్లూరులో నలుగురు అరెస్టు
- 30 లక్షల విలువైన 56 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల్లేని ప్రాంతాలను ఎంచుకుంటారు.. రోడ్డుపై అటూ ఇటూ తిరుగుతూ సరైన సమయం కోసం ఎదురు చూస్తారు... జనం లేని సమయం చూసి రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న బైక్‌లను క్షణాల్లో మాయం చేస్తారు. ఇలా ఆరు జిల్లాల్లో బైక్ చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసిరిన ఓ ముఠా ఎట్టకేలకు పట్టుబడింది. నెల్లూరు జిల్లా పోలీసులు ఈ ముఠాలోని నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 56 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ కృష్ణకాంత్ శుక్రవారం విలేకరులకు వెల్లడించారు.నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు చెందిన ఎ శివ గతంలో హత్యాయత్నం, బైక్ దొంగతనాల కేసుల్లో జైలుకెళ్లొచ్చాడు. ఆ తర్వాత శివ, ఆయన చిన్నమ్మ కుమారుడు రవిదుర్గ, పాతనేరస్థులైన అల్లూరు మండలం చౌటపాలెంకు చెందిన కె నాని, హోసన్న కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డారు. వారు సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను టార్గెట్ చేసుకొని నెల్లూరు, తూర్పుగోదావరి, కడప, ప్రకాశం, బాపట్ల, తిరుపతి జిల్లాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. నెల్లూరు జిల్లాలో బైక్ దొంగతనాలు అధికమవడంతో ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సీతారామయ్య, అశోక్, కొడవలూరు సీఐ సురేంద్రబాబు తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఈ నెల 6న కొడవలూరు మండలం పద్మనాభసత్రం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా శివతోపాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా.. నెల్లూరు జిల్లాలో 24, తిరుపతిలో 21, ప్రకాశంలో 8, బాపట్ల, తూర్పుగోదావరి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో మూడు బైక్‌లు చోరీ చేసినట్లు వారు అంగీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.30 లక్షలు విలువచేసే 56 బైక్‌లు దొంగలించినట్లు వెల్లడించారు. పోలీసులు వారి నుంచి బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ అభినందించి రివార్డులు అందజేశారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 546.90 అడుగులు ఉంది. ఇది 203.00 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5156 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 12,230 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 29,986 నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 17,964 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

### పశ్చిమ డెల్టాకాల్వకు ..

దుగ్గిరాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1818 క్యూసెక్కులు శుక్రవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.8 అడుగుల నీటి మట్టం ఉందన్నారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 113,121,132 |
| చికెన్ విత్ స్కిన్ | 216.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 226.00 |

## 93,597 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 84,278 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 93,597 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 65,583 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | | ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 9000 | 13700 | 334 | 9500 | 11000 |
| నెంబరు. 5 | 10000 | 14000 | నెంబరు.5 | -- | -- |
| 273 | 10000 | 13500 | 273 | -- | -- |
| 341 | 10000 | 14700 | 341 | -- | -- |
| 4884 | 10000 | 12000 | 4884 | -- | -- |
| సూపర్ 10 | -- | -- | సూపర్ 10 | -- | -- |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | | ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 10000 | 14500 | తేజ | 10000 | 14000 |
| బ్యాడిగి | 10000 | 13600 | బ్యాడిగి | 11000 | 12000 |
| దేవనూరు డీలక్స్ | 10000 | 13500 | దేవనూరు డీలక్స్ | -- | -- |
| తెల్లకాయలు | 4000 | 7500 | తెల్లకాయలు | 4000 | 7500 |

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 33.39 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని రాజు తెలిపారు.



సీఎం చంద్రబాబుతో జానీ బాషా

## రాష్ట్ర పునఃనిర్మాణంలో సీఎం చంద్రబాబు కృషి భేష్

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, ఫిబ్రవరి 7 : విధ్వంసమైన స్వరాష్ట్రాన్ని పునర్నిర్మాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషి ఎంతో ప్రసంశనీయమని ప్రవాసాంధ్రులు కొనియాడారు. సౌదీ అరేబియాలోని రియాద్ నగర ప్రవాస ఆంధ్రుడు, పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన జానీ బాషా రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిశారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి చంద్రబాబు చేస్తున్న కృషి పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమర్ధవంతమైన నాయకుడంటూ సీఎం చంద్రబాబు ప్రశంసించారని జానీబాషా వెల్లడించారు.

## జోన్ డైరీ

● అచ్చంపేట మండలంలోని అంబడిపూడి గ్రామంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు శనివారం గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం శుక్రవారం తెలిపారు. విజయవాడలోని హెల్ప్ ఆస్పత్రి వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేస్తారని, ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● మాచర్ల పట్టణంలోని కేసీపీ వీఎల్ దత్తు ఆడిటోరియంలో ఈనెల 11న ప్రైవేటు పాఠశాలల బస్సు, ఆటో, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు శేషురెడ్డి తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వారి బస్సు డ్రైవర్లను తప్పనిసరిగా ఈ కార్యక్రమానికి పంపించాలని సూచించారు.

● దుర్గి మండలంలోని తేరాలలో ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి రోజున కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు 10వ తేదీ వేలం నిర్వహిచనున్నట్లు ఆలయ కమిటి సభ్యుడు గంగుల సిద్ధిరాజు తెలిపారు. ఆసక్తి గల వారు 9640166526 నంబరుకి ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

## ఆలపాటి నామినేషన్‌కు తరలివెళ్లిన కూటమి శ్రేణులు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో శుక్రవారం జరిగిన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి జీవీరెడ్డి గ్రూప్ స్కాలర్స్ జూనియర్ కళాశాల యాజమాన్యం, పిడుగురాళ్ల స్కాలర్స్ డైరెక్టర్లు జి శ్రీనివాసరెడ్డి, ఎ జగదీశ్వరరెడ్డిల ఆధ్వర్యాన కూటమి నేతలు తరలి వెళ్లారు. వీరిలో వడ్డవల్లి సర్వేశ్వరరావు, షేక్ ఖాసీం, వల్లెపు రామకృష్ణ, షేక్ సైదా, నడికుడి వెంకటేశ్వరరావు, బిజ్జిలి వెంకట్రావు, మొగిలి ఏడుకొండలరావు, జమ్మిశెట్టి రామకృష్ణ, గోళ్ల కిరణ్‌కుమార్, చాట్ల సునీల్, గంగయ్య, దూదేకుల ఖాసీం ఉన్నారు.

● మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణలు ఆలపాటి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మట్టి పోసి.. మాయ చేసి..

● వాకింగ్ ట్రాక్ నిధులు రూ.కోటి స్వాహా
● ఇదీ గత వైసీపీ పాలకుల మోసం

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం.. హైదరాబాద్‌లోని ట్యాంకు బండును తలపించేలా అభివృద్ధి చేస్తాం.. అన్ని హంగులతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తాం.. అంటూ ప్రగల్భాలు పలికారు. తీరా కాస్త మట్టి పోసి మాయ చేశారు. సుమారు రూ.కోటి దాకా కొట్టేశారు. ఇది గత వైసీపీ పాలనలో పురపాలకుల బడా మోసం. పార్టీ అధికారంలో ఉంది కదా అడిగేదెవరులే అన్ని అభివృద్ధికి మంజూరైన నిధులను మింగేశారు.



పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో అధ్వానంగా దర్శనమిస్తున్న వాకింగ్ ట్రాక్



పిచ్చిమొక్కలు, ముళ్లపొదల మధ్యన వాకింగ్‌ట్రాక్

**రూ. 99,99,000 మంజూరు**

పట్టణంలో సరైన వాకింగ్‌ట్రాక్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాకర్స్, పట్టణ వాసులు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని గత వైసీపీ ప్రభుత్వంలో పురపాలకులను కోరారు. ఇందుకోసం కౌన్సిల్ సభ్యులు అజెండాలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటును చేర్చి ఆమోదం కూడా పొందారు. దీంతో పట్టణంలోని పంపుహౌస్ వద్ద గల సమ్మర్ స్టోరేజీ ట్యాంకు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి 2019-2020 సంవత్సరంలో 14వ ఆర్థికసంఘం నిధులు రూ. 99,99,000 మంజూరయ్యాయి. ప్రజాప్రతినిధులు హంగు ఆర్భాటాలతో శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. 3 మీటర్లు వెడల్పు, సుమారు 3 కి.మీ.ల మేర వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కాస్తంత మట్టి పోసి నిధులు మొత్తం కాజేశారు.

**పిచ్చి మొక్కలు.. ముళ్ల పొదలు**

గత వైసీపీ పాలకుల మోసంతో ప్రస్తుత వాకింగ్ ట్రాక్ ప్రాంతం పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయింది. వాకింగ్ ప్రాంతం సైతం పిచ్చి మొక్కలతో నిండి రూపురేఖలు కోల్పోయింది. కనీసం నడిచేందుకు సైతం వీలు లేకుండా పోయింది. వైసీపీ హయాంలో పోసిన మట్టి కూడా కనిపించడం లేదు. అభివృద్ధి కోసం మంజూరైన సుమారు రూ.కోటి నిధులు వైసీపీ నేతల జేబుల్లోకి వెళ్లాయి.

## 10న నులిపురుగుల నివారణ దినోత్సవం

క్రోసూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) :ఫిబ్రవరి 10న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ధనుష్, డాక్టర్ షాద్, డాక్టర్ సిరిచందనలు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో జీ శ్రీనివాసరావు చిన్నారులకు, విద్యార్థులకు అందజేసే నులి పురుగుల మాత్రలను వైద్యాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 19 సంవత్స రాల లోపు పిల్లలందరికీ 10వతేదీ ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ తదిరులు పాల్గొన్నారు.

**అచ్చంపేట,(ఆంధ్రజ్యోతి):**స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఎన్ఎం, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులకు నులి పురుగుల నివారణ కార్యక్రమంపై ఎంపీడీవో కే శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్‌బెండా జోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వి.రాంబాబు, పీహెచ్ఎన్ పి.వెంకటరావు, ఈవోపీఆర్‌డీ ప్రసాదు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యమ్మ, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పెదకూరపాడులో నులి పురుగుల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

**పెదకూరపాడు, (ఆంధ్రజ్యోతి):** స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో జాతీయ నులి పురుగుల దినోత్సవ వాల్‌పోస్టర్లను 75 తాళ్ళూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెలుగొండారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, అంగన్ వాడీ సూపర్‌వైజర్ మున్ని, పీహెచ్‌సీ అధికారులు విజయకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి):** దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ వాల్‌పోస్టర్లను వైద్యులు అమూల్య, మధు, ఎంపీడీవో రత్నం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో పిణాక పాణి, ఎంపీహెచ్ఈవో పట్టాభి, పీహెచ్‌వో కృష్ణకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు సరస్వతి దేవి, మేరి కుమారి పాల్గొన్నారు.



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న న్యాయాధికారి

## విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

రెంటచింతల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతలలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో శుక్రవారం గురజాల సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు (సీనియర్‌డివిజన్), అదనపు సివిల్ జడ్జి అలేఖ్య (జూనియర్ డివిజన్) ఆధ్వర్యాన న్యాయ అవగాహన సదస్సులో భాగంగా విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యాహక్కు, వరకట్నం, ఫోక్సో తదితర చట్టాలను విద్యార్థినులకు వివరించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్‌కే బాషా, కలివెల ప్రభుదాసు, సురేష్, కోర్టుసిబ్బంది శశికళ, ఏఎస్‌డబ్ల్యూవో సుజాతకుమారి, వార్డెన్లు అరుణకుమారి, నూరెల్లాబేగ్ పాల్గొన్నారు.

## వైభవంగా కళ్యాణ మహోత్సవం

మాచవరం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోర్జంపాడు గ్రామంలో వున్న లక్ష్మీనరసింహాస్వామి 69వ కళ్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సుమారు 50 మంది పుణ్యదంపతులచే పూజారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహింపచేశారు. ఈ సందర్భంగా మాచవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు. కళ్యాణం అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామ కమిటీ వారి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## జ్యోతిర్లింగ యాత్ర రథం ప్రారంభం

కారంపూడి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మాకుమారీస్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగ యాత్ర రథంను శుక్రవారం పట్టణంలోని అంకాళమ్మ గుడి వద్ద తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్, ఎంపీడీవో జి శ్రీనివాసరెడ్డిలు ప్రారంభించారు. ఈ యాత్ర రథం మాచర్ల పట్టణంలోని నరిశెట్టి కళ్యాణ మండపం వద్దకు చేరుకుంటుందని, ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచనున్నట్లు బ్రహ్మాకుమారీస్ ప్రతినిధులు తెలిపారు. ధ్యానంతో వ్యసనాలను దూరం చేసుకోవడంపై వివరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ఆలయ ప్రతిష్ఠ

● హాజరైన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగిరిపాడులోని పోలేరమ్మ అమ్మవారి గుడి ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నసంతర్పణ గావించారు. కార్యక్రమలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, దర్శనాల శ్రీనివాసరెడ్డి, సోముల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బోదనం కృష్ణానదిలో చేప పిల్లలను వేస్తున్న అధికారులు

## కృష్ణారేవులో చేప పిల్లల విడుదల

బెల్లంకొండ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని బోదనం కృష్ణారేవులో జిల్లామత్స్యశాఖ అధికారి ఎస్ సంజీవరావు మండల అధికారులతో కలసి శుక్రవారం చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనపథకం కింద 10 లక్షల చేప పిల్లలను నదిలోకి వదిలినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలమేరకు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాచర్ల మత్స్యశాఖ సహాయ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, సత్తెనపల్లి మత్స్యశాఖ పర్యవేక్షకులు భాగ్యలత, తహసీల్దార్ ఆసిఫున్నీసాబేగం, ఎంపీడీవో హనిమిరెడ్డి, ఏవో కృష్ణయ్య, పావని, రమేష్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎక్సైజ్ సీఐ విజయకుమార్ తదితరులు

## విలువలతో కూడిన విద్యనందించాలి

సత్తెనపల్లిరూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యనందించినప్పుడే విద్యార్థులు ఉన్నత పౌరులుగా ఎదిగి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ పీ విజయ కుమార్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం హెల్ప్ ఫౌండేషన్, టీచర్ మస్తాన్, ఐటీఐ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మాతా రమాబాయి అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ముందుగా వక్తలు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో స్త్రీపాత్ర ఎంతో ముఖ్యమైందని, స్త్రీలను గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు వ్యసనాలకు గురికాకుండా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. రమాబాయి జీవితాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, కంచర్ల బుల్లిబాబు, సోమశేఖర్, ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 'నో హెల్మెట్.. నో ఎంట్రీ' కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలను నడుపుతున్న వారిని నిలిపి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆయుర్వేద మందులు పంపిణీ


బెల్లంకొండ, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆయుర్వేద వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో బాలసుందరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సాగు నీరు అందించాలి

పెదకూరపాడు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలోని అమరావతి మేజరుకు ఏప్రిల్ వరకు సాగు నీరు ఇవ్వాలని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్ దర్శి శేషారావు కోరారు. ఈమేరకు శుక్రవారం పెదకూరపాడులో తహసీల్దార్ ధనలక్ష్మిని కలసి వినతిపత్రం అందించారు. మైనర్ కాలువల కింద మిరప, పొగాకు, మొక్కజొన్న సాగు చేస్తున్నారని, నిరంతరాయంగా సాగు నీరు అందకపోతే పంటలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ వేడుక

● ఘనంగా సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల 75వ వార్షికోత్సవం
● 61 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు
● హాజరైన ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యేలు యరపతినేని,జూలకంటి

రెంటచింతల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 75వ వార్షికోత్సవం, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.


1949లో స్థాపించిన సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల 75 సంవత్సరాల వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 1964లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసిన విద్యార్థులు 61 సంవత్సరాల తర్వాత కలిశారు. కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య, హెచ్ఎం దుర్గాప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘ నేతలు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అమ్మ జన్మనిస్తే సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల జీవిత పాఠాలను నేర్పిందన్నారు. రైతు బిడ్డగా ఉన్న తనను అసెంబ్లీ మెట్లెక్కేలా తన మాస్టార్లు తీర్చిదిద్దారని, 1975 నుంచి 80 వరకు ఈ పాఠశాల లోనే చదువుకున్నానన్నారు. ఇన్నేళ్ల తర్వాత నాటి మిత్రులను కలుసుకోవడంతో మది పులకించిపోయిందన్నారు. తాను జీవించినంత కాలం తన ఉపాధ్యాయులకు రుణపడి ఉంటానని, పాఠశాల అభివృద్ధికి శక్తి వంచనలేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

విశ్రాంత డీజీపీ బండి మరియకుమార్ మాట్లాడుతూ ఐపీఎస్‌కు ఎంపికై 2016 నుంచి 18 దాకా మధ్యప్రదేశ్ రాష్ట్ర డీజీపీగా పనిచేశాను. 33 సంవత్సరాలపాటు సర్వీసు చేశాను. తాను ఈ స్థాయికి ఎదగడానికి నాటి పాఠశాల గురువులే కారణమని అన్నారు. ఉపాధ్యాయులు చదువుతో పాటు క్రమశిక్షణ నేర్పించడం వల్లనే ఈస్థాయికి ఎదిగానని మరియకుమార్ తెలిపారు.

సీనియర్ సైంటిస్ట్ మందపాటి మోహన్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఒక్క రోజులో ఎన్నో ఏళ్ల పాత రోజులు గుర్తుకొచ్చాయని తెలిపారు. ఎంతటి ఉన్నత స్థితిలో ఉన్నా చదుకున్న పాఠశాలను, విద్యను బోధించిన గురువులను మరచిపోకూడదన్నారు.

ముఖ్య అతిథిగా హాజరైన మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గొప్పవాళ్లను అందించిన ఈ పాఠశాల తన నియోజకవర్గంలో ఉండడం విశేషమన్నారు. చిన్నతనం నుంచే ఓర్పు, నేర్పు, సహనాన్ని నేర్పించిన టీచర్ల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.

ముందుగా ఎమ్మెల్యేలు యరపతినేని, జూలకంటిలకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో ఫాదర్లు వైఎల్ మర్రెడ్డి, రఫేల్‌రెడ్డి, ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ పులుకూరి కాంతారావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. జబర్దస్త్ షో ఉర్రూతలూగించింది.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

## నులి పురుగుల నిర్మూలనకు కృషి

● డాక్టర్ వేమవరపు ప్రదీప్, ఫణిదం పీహెచ్‌సీ

ఫటా ఫట్



సత్తెనపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లల్లో నులి పురుగుల నిర్మూలనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఫణిదం పీహెచ్‌సీ డాక్టర్ వేమవరపు ప్రదీప్ అన్నారు. 10వ తేది జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్ బెండా జోల్ 400 ఎంఎం మాత్రలను అందిస్తామని తెలిపారు. డాక్టర్ ప్రదీప్‌తో శుక్రవారం ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

**ప్రశ్న : నులి పురుగుల వలన వచ్చే సమస్యలేంటి?**

డాక్టర్ : కడుపులో నులి పురుగులు ఉన్న పిల్లలు, కిషోర బాలలు రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించటం, నీరసం, ఆందోళన, కడపు నొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గటం వంటి వాటికి గురవుతారన్నారు.

**ప్రశ్న : ఆల్‌బెండజోల్ మాత్రలు ఎక్కడెక్కడ ఇస్తారు?**

డాక్టర్ : ఒకటి నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్ వాడీ కేంద్రాల్లో, ఆరు నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు ఇస్తారు. ఆయా కేంద్రాల్లో నమోదు అవ్వని, పాఠశాలకు వెళ్ళని పిల్లలు, కిషోర బాలలకు అంగన్ వాడీ కేంద్రాల్లో ఇచ్చే విధంగా ఏర్పాటు చేశాం. వీటిని పిల్లల చేతికి ఇవ్వకుండా అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలల్లోనే మింగిస్తారు.

**ప్రశ్న : నులి పురుగుల నుంచి రక్షణకు ఏ చర్యలు తీసుకోవాలి ?**

డాక్టర్ : పిల్లల గోళ్ళను చిన్నవిగా, శుభ్రంగా ఉంచాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. ఏదైనా తిన్న తర్వాత, మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేయించాలి. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా మరుగు దొడ్డి ఉపయోగించేలా చూడాలి.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 220/132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ నాగసురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు త్రీ ఫేజ్ విద్యుత్‌ను శుక్రవారం అర్ధరాత్రి 12 నుంచి శనివారం ఉదయం 9 గంటల వరకు అందించనున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని డీఈఈ కోరారు.

**దాచేపల్లి, (ఆంధ్రజ్యోతి):** దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం, నడికూడి, అంజనాపురం, దాచేపల్లిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**దుర్గి, (ఆంధ్రజ్యోతి):** దుర్గి మండల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీశైలం శుక్రవారం తెలిపారు. ఎల్‌టీ, హెచ్‌టీ లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బెల్లంకొండ, పాపాయపాలెం సబ్ స్టేషన్‌ల పరిధిలో 33 కేవీ, 11 కేవీ ఎల్‌టీ లైన్లు మరమ్మతుల దృష్ట్యా శని వారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ పవన్ కుమార్ తెలిపారు.

**అమరావతి, (ఆంధ్రజ్యోతి):** మహాశివరాత్రి పర్వదిన ఏర్పాట్లలో భాగంగా విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రవికిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## క్రైమ్ జోన్

### ట్రాక్టరుని ఢీకొట్టిన లారీ.. ఒకరు మృతి

నకరికల్లు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ట్రాక్టరుని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ట్రాక్టరు డ్రైవరు మృతి చెందిన ఘటన శుక్రవారం నకరికల్లులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత కంప్యూటర్ల లోడుతో తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ నకరికల్లులో రోడ్డ పక్కన ఆగి వున్న ట్రాక్టరుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నకరికల్లు చెందిన ట్రాక్టరు డ్రైవరు అనుముల మస్తాన్(50)పై లారీ పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీడ్రైవర్ మెహరాజ్‌మల్లిక్‌కు కుడికాలుకు తీవ్ర గాయమైంది. పోలీసులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వాగులో వృద్ధుడి మృతదేహం లభ్యం

అచ్చంపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని పశువుల ఆస్పత్రి సమీపంలో గల వాగులో ఓ వృద్ధుడి మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. ఒంటిపై ఉన్న టీషర్టు ఆధారంగా ఆమృతదేహం అచ్చంపేటకు చెందిన నెల్లూరి అంజనేయులు (70) గుర్తించారు. ఆందజనేయులు జనవరి 15న నుంచి ఇంటి నుంచి వెళ్ళి తిరిగి రాలేదు. దీంతో బంధువులు ఫిబ్రవరి 2న స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య అంజమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహం పూర్తిగా పాడైపోవటంతో ఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ వెంకట ప్రసాదు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

### భార్యపై బ్లేడుతో దాడి.. కేసు నమోదు

మాచర్లటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భార్యపై భర్త బ్లేడుతో దాడి చేసిన ఘటన శుక్రవారం మాచర్ల పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జెండాచెట్టు వద్ద షేక్ రియాజ్, నూర్జహాన్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం. రియాజ్ పట్టణంలో పూల వ్యాపారం చేస్తుంటాడు. భర్త మద్యంకు బానిసై వేధిస్తుండడంతో నూర్జహాన్ ఏడాది క్రితం తన ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఆమెను ఇంటికి రావాలంటూ రియాజ్ తరచూ గొడవ పడేవాడు. శుక్రవారం మద్యం తాగి నూర్జహాన్ ఇంటికి వెళ్లి ఆమెపై దాడి చేశాడు. దీంతో ఆమె మెడపై గాయమైంది. నూర్జహాన్ కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఆమెను రక్షించి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని నూర్జహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం రియాజ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

### గుండాట వద్ద ఘర్షణ.. పోలీసుల లాఠీచార్జ్

మాచవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుండాట వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. లక్ష్మీనరసింహా స్వామి తిరునాళ్ళను పురస్కరించుకొని పలువురు అర్ధరాత్రి వరకు గుండాల నిర్వహించారు. ఆ సమయంలో గుండాట నిర్వాహకులకు, ఆట ఆడేవారికి మధ్య డబ్బులు విషయంలో ఘర్షణ వాతావరణం నెలకుంది. విషయం తెలుసుకున్న మాచవరం ఎస్ఐ కే సతీష్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్ప ప్రయత్నించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో లాఠీచార్జ్ చేశారు. ఈ ఘటనలో ఒక యువకుడు తప్పించుకొనేందుకు పారిపోతూ కింద పడిపోగా అతడి తలకు గాయమైంది. పోలీసులు ఆ యువకుడిని వారి వాహనంలోనే పిడుగురాళ్ళలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందజేశారు.

# 'చార్వాక' సంస్కృతే వేరు!

● తొలినాళ్లలో విద్యాపీఠంగా ఎందరికో జ్ఞానబోధ
● నాస్తిక, హేతువాద భావాలతో జన చైతన్యం
● నేడు, రేపు నాస్తిక మేళా



నిడమర్రులోని చార్వాక ఆశ్రమం

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏ మతానికి చెందిన వారైనా భావవాదులు ఓ వైపు.. దానికి ప్రత్యామ్నాయంగా నాస్తిక వాదులంతా ఓ వైపు నిలిచారు. మతంపై, దాని తాలూకూ విశ్వాసాలపై పోరాడుతున్న నాస్తిక, హేతువాదులకు వేదికగా సరిగ్గా 52 ఏళ్ల క్రితం చార్వాక విద్యా పీఠం ఏర్పాటైయింది. ప్రత్యామ్నాయ తాత్విక చింతనను ఆలవాలంగా, రెండు తెలుగు రాష్ట్రాల్లో బలమైన వేదికగా ఈ చార్వాక విద్యా పీఠం ఏర్పాటైయింది.

● 1972లో ఏర్పాటైన విద్యాపీఠం

1972లో చార్వాక ఆశ్రమం ఏర్పడింది. తాడికొండ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బొడ్డు రామకృష్ణ మాస్టారు ప్రత్యామ్నాయ సంస్కృతివ్యాప్తిలో భాగంగా ఆశ్రమాన్ని ఏర్పాటుచేశారు. 1973లో మంగళగిరి మండలం నిడమర్రు గ్రామం లో విశాలమైన ప్రాంగణంలో ఆశ్రమాన్ని ఏర్పాటుచేశారు. భౌతికవాద విద్యా వ్యాప్తి కోసం ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేసి 1974లో 'ప్రగతి విద్యావనం' పేరుతో చా ర్వాక విద్యాపీఠాన్ని ఏర్పాటుచేశారు. 2005 వరకూ విద్యాపీఠాన్ని నడిపారు. సొంతంగా సిలబస్‌ను రూపొందించుకుని విద్యాబోధన చేశారు. ఆయన వద్ద చదువుకున్న ఎంతోమం ది విద్య, వైద్య, రాజకీయరంగాల్లో ప్రముఖులుగా ఎదిగారు. దళిత ఉద్యమనేత కత్తి పద్మారావు కూడా తొలినాళ్లలో రామకృష్ణ మాస్టారు శిష్యుడిగా విద్యార్జన చేశారు.

● ఆశ్రమంలో భౌతికవాదుల సంస్కృతులు ఎన్నో..

53 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో చార్వాక ఆశ్రమం కేవలం నాస్తిక, హేతువాద భావాలకే పరిమితం కాలేదు. అది


ఆశ్రమ వ్యవస్థాపకుడు రామకృష్ణ మాస్టారు

ఎన్నోరకాల తాత్విక చింతనలు, భావాల వ్యాప్తికి నిలయంగా నిలిచింది. 'సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మాబొరుసులు' అన్న నినాదంతో ఎన్నోరకాల సామాజిక ఉద్యమాలు, అణగారినవర్గాల అస్తిత్వ ఉద్యమాలు, పీడిత ప్రజల విముక్తి పోరాటాలు, విప్లవభావాలు, ద్రవిడ సంస్కృతి, సంప్రదాయాల వ్యాప్తికి ఆశ్రమం వేదికగా నిలిచింది. వామపక్ష, ప్రజాతంత్ర, విప్లవ శ్రేణులన్నింటితోనూ ఆయన మమేకమయ్యారు.

● తొలితరం శాస్త్రవేత్తలు..

చరిత్రపుటల్లో స్థానం కోల్పోయిన తొలితరం భౌతిక శాస్త్రవేత్త(సైంటిస్టు)లంతా ఇక్కడ కనిపిస్తారు. కణ శాస్త్రం పై వేల సంవత్సరాల క్రితం చెప్పిన కపిలుడు, కణాదుడు, అసిత కేశకంబళుడు, మక్కలి గోశాలుడు, పూర్ణ కశ్యపుడు, సాంఖ్య, శూద్రకుడు వంటి చరిత్రను మలిచిన ఎందరో శాస్త్రవేత్తలు ఇక్కడ విగ్రహాల రూపంలో నేటితరాన్ని పలకరిస్తుంటారు. బుద్ధుడు, మహాత్మా జ్యోతిరావ్‌పూలే, సావిత్రిబాయిపూలే, బీ ఆర్ అంబేద్కర్ విగ్రహాలు కన్పిస్తాయి.

● దేశంలో ఎక్కడా కనిపించని వేమన ఇక్కడ..

వేమన అనగానే దిగంబరుడిగా ఉన్న చిత్రాలు గుర్తుకువస్తాయి. కానీ ఇక్కడ ఏర్పాటుచేసిన వేమన విగ్రహం చాలా ప్రత్యేకమైనది. చార్వాక ఆశ్రమం స్వాగత ద్వారం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఈ విగ్రహాన్ని రామకృష్ణ మాస్టారు ఎంతో ప్రత్యేకంగా రూపొందించారు. పంచెకట్టులో కనిపించే ఈ విగ్రహం చార్వాక ఆశ్రమ ఔన్నత్యానికి మకుటాయమానంగా నిలుస్తోంది.

● నాస్తికుల పండగ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భౌతికవాదులందరికీ ఒక పండగగా నాస్తిక మేళాను నిర్వహిస్తున్నారు. ఇప్పటికి 33 ఏళ్లుగా ఈ నాస్తిక మేళా జరుగుతోంది. 2007లో రామకృష్ణ మాస్టారు చనిపోయినప్పటి నుంచి ఆయన వారసులు మేళాను కొనసాగిస్తున్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి రెండో శని, ఆదివారాల్లో ఈ మేళా జరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా నాస్తికులు, భౌతికవాదులు వారి కుటుంబసభ్యులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొంటారు.


తొలితరం సైంటిస్టులు కపిలుడు, కణాదుడు, అసితడు, మక్కలి

# ఉల్లాసంగా.. విజ్ఞానోత్సవ్

● సందడి చేసిన సినీ తారలు
● ఆకట్టుకున్న క్రీడా, సాంస్కృతిక పోటీలు


మాట్లాడుతున్న సినీ హీరో విశ్వక్‌సేన్


ఖోఖోలో పోటాపోటీగా..


కబడ్డీలో...

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): యువతీ, యువకులు చేస్తున్న సందడితో విజ్ఞాన్ మహోత్సవ్ శుక్రవారం ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య పి.నాగ భూషణ్ మాట్లాడుతూ ఆటల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం వలన జిజ్ఞాస, సమర్థ, సమయ పాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోవడం ఇలా ఎన్నో అంశాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

'లైలా' సినిమా యూనిట్ సందడి

విద్యార్థులందరూ మీ మనసు చెప్పిందే వినాలని సినీ హీరో, డైరెక్టర్, స్క్రీన్ రైటర్ విశ్వక్‌సేన్ అన్నారు. యువత తమలో అంతర్లీనంగా ఉన్న నైపుణ్యాలు వెలికి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సందర్భంగా 'లైలా' సినిమా యూనిట్ సందడి చేసింది. హీరో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ ఈ నెల 14న సినిమా ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందన్నారు. మొట్టమొదటి సారిగా లైలా అనే అమ్మాయి పాత్రధారణలో నటించానని పేర్కొన్నారు. అనంతరం లైలా సినిమా యూనిట్ విద్యార్థులతో సెల్ఫీలు దిగారు.

పోటాపోటీగా..

జాతీయ స్థాయి విజ్ఞాన మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు నువ్వా నేనా అన్నట్లు పోటీ పడ్డారు. అథ్లెటిక్స్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలను నిర్వహించారు. జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. వీటితోపాటు మ్యూజిక్, లిటరరీ, స్పాట్‌లైట్, డాన్స్, డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్ కల్చరల్స్ థియేటర్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్, స్క్రీన్ రైటర్ కే.ఎస్.రవీంద్ర (బాబీ), 2024 పారాలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబీనా ఫ్రాన్సిస్ హాజరు కానున్నట్లు వీసీ వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.




శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు


నృత్యం చేస్తున్న విద్యార్థిని

# అట్టహాసంగా ఆలపాటి నామినేషన్

● జనసంద్రంగా గుంటూరు నగరం
● మూడు పార్టీల నేతలతో ప్రదర్శనగా కలెక్టరేట్‌కు
● సంఘీభావంగా ఉమ్మడి కృష్ణాజిల్లా నేతలు


నామినేషన్‌కు ప్రత్యేక వాహనంలో వెళ్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, మంత్రి మనోహర్, ఎమ్మెల్యేలు మాధవి, నజీర్, కామినేని శ్రీనివాస్ తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసన మండలి స్థానానికి పోటీ చేస్తున్న ఎన్డీఏ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నామినేషన్ ప్రక్రియ అట్టహాసంగా జరిగింది. మూడు పార్టీల శ్రేణులు వేలాదిగా తరలి రావడంతో గుంటూరు నగరం జనసంద్రంగా మారింది. శుక్రవారం ఉదయం గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం నుంచి తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు, బీజేపీ శ్రేణులు కదం తొక్కారు. యువనేతలు, కార్యకర్తలు నగరంలో బైకు ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు ఆలపాటికి సంఘీభావం ప్రకటించి ర్యాలీలో భాగమయ్యారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు మొదలు సాధారణ కార్యకర్త వరకూ ప్రదర్శనలో అగ్రభాగాన నిలిచారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి నాదెండ్ల మనోహర్, కృష్ణా జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మాజీ మంత్రులు, రాష్ట్ర శాసన సభ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, కామినేని శ్రీనివాసరావు, తెనాలి శ్రావణ్ కుమార్, గళ్లా మాధవి, మొహమ్మద్ నసీర్, జూలకంటి బ్రహ్మారెడ్డి, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, వేగేశ్న నరేంద్రవర్మ, అరవిందబాబు, కుమార రాజా, ఎమ్మెల్సీ పర్చూరి ఆశోక్‌బాబు, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, జెడ్పీ చైర్మన్ హెనీ క్రిష్టినా, పలు కార్పొరేషన్ల చైర్మన్లు ఆలపాటికి తోడుగా నిలిచి ప్రదర్శనగా ఆయన్ను గుంటూరు కలెక్టరేట్‌కు తీసుకుపోయారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో మూడు పార్టీల నేతలు చేతులు కలిపి తమ ఐక్యతను చాటారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ కూటమి పిలుపులో భాగంగా జనసేన ఆలపాటికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బీజేపీ శ్రేణులు ఆలపాటి గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తాయన్నారు. ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ధర్మం ప్రకారం తెనాలి సీటును ఆలపాటి త్యాగం చేశారని గుర్తుచేశారు. ప్రదర్శనలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టం రఘురామ్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, బీజేపీ నేత వల్లూరి జయప్రకాశ్, జనసేన రాష్ట్ర నేత బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, టీడీపీ సీనియర్ నాయకుడు మన్నవ సుబ్బారావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, తాడిశెట్టి మురళి, కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, మన్నవ వంశీకృష్ణ, రావిపాటి సాయికృష్ణ, నన్నపనేని రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన నేతలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుంటూరు-కృష్ణా ఉమ్మడి జిల్లాల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. నామినేషన్ అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆలపాటి నామినేషన్‌కు పెద్దఎత్తున కార్యకర్తలు రావడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే వ్యవస్థలు గాడిలో పడుతున్నాయని ఈ సమయంలో ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆలపాటి రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ 33 నియోజకవర్గాల పరిధిలోని పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేయడానికి కూటమి అవకాశం కల్పించిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ అంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పామర్రు ఎమ్మెల్యే వర్ల రాజా, గళ్లా మాధవి, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, తెనాలి శ్రావణ్ కుమార్, యరపతినేని శ్రీనివాసరావు, నజీర్ అహమ్మద్, నక్కా ఆనంద్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు నెట్టెం రఘురాం మాట్లాడుతూ ఆలపాటి గెలుపులో నాయకులు కీలక పాత్ర పోషించాలని కోరారు.


ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ నామినేషన్ వేస్తున్న సందర్భంగా సంఘీభావం తెలియజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనందబాబు, గళ్లా మాధవి, నసీర్, కామినేని శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వరరావు తదితరులు

# సకల జనులకు ఆశీర్వాదకర జీవితం

● డాక్టర్ జె.ప్రమీలా సెల్వరాజ్‌కి ఘన నివాళి


జ్ఞాపకార్థ ప్రార్థనలో ప్రసంగిస్తున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

పెదకాకాని, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బైబిలు మిషను స్త్రీల సభల కన్వీనర్, రెండో శనివారం ఉపవాస ప్రార్థనల వ్యవస్థాపక నిర్వాహకురాలు డాక్టర్ జె.ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక శుక్రవారం పెదకాకాని స్వస్థిశాలలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి బైబిలు మిషను వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు అధ్యక్షత వహించారు. తొలుత ప్రార్థనలు, కీర్తనలు, వాక్యపఠన జరిగాయి. అనంతరం ముఖ్యవక్తలుగా హాజరైన పలువురు డాక్టర్. జె.ప్రమీలా సెల్వరాజ్‌తో ఉన్న గత స్మృతులను విశ్వాసులకు వివరించారు.

బైబిలు మిషను వ్యాప్తిలో...

దేశ, విదేశాలలో బైబిలు మిషను వ్యాప్తికి, ప్రజలందరికీ దేవుని సువార్తను చేరువ చేయడంలో డాక్టర్. జె.ప్రమీలా సెల్వరాజ్ కృషి విలువైనదని మాజీ కేంద్ర సహాయ మంత్రి జేడీ శీలం అన్నారు. ప్రమీలమ్మతో ఆయనకున్న ఆత్మీయ పరిచయ, సంఘటనలను వెల్లడించారు. మోకాళ్ల ప్రార్థన అనుభవంతో ఎంతో మందికి ఆశీర్వాదాలు అందించే ఆత్మీయ తల్లిగా ఎదిగారని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఓ.ఎస్.డి. ఆచార్య ఎన్.శామ్యూల్ అన్నారు. కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్ జయ భారతరావు, కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ మథ్యూస్, యూపీఎఫ్ వ్యవస్థాపకులు రవి ప్రసాద్, వినీత, లాయర్ సురేష్, యశోద హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చినబాబు, ప్రమీలారాణి, యూపీఎఫ్ ప్రెసిడెంట్ జోసెఫ్, బైబిలు ప్రొఫెసర్ శాంత సుధాకర్, హైదరాబాదు బైబిలు మిషను పాస్టర్ జాన్ క్రిష్టాఫర్ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. అనంతరం ప్రమీలా సెల్వరాజ్ కుటుంబ సభ్యులు దాసరి దేవరాజు వందన సమర్పణ చేశారు. బైబిలు మిషను సెక్రటరీ కోట్ల ప్రశాంత్ కుమార్ ముగింపు ప్రార్థన, బైబిలు మిషను ఉపాధ్యక్షుడు పి.జాన్ దేవదాసు ఆశీర్వాదాలతో జ్ఞాపకార్థ కూడిక ముగిసింది. కార్యక్రమంలో బైబిలు మిషను అధ్యక్షుడు, కాకాని స్వస్థిశాల నిర్వాహకులు, కుమారులైన జె.శామ్యేల్ కిరణ్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, ఆగమనరావు, రవి, గవర్నింగ్ బాడీ సభ్యులు, యాజకులు,సేవకులు, అభిమానులు పాల్గొన్నారు.

# 11 నామినేషన్‌ల దాఖలు

● కోలాహలంగా గుంటూరు కలెక్టరేట్
● ఇక మిగిలింది చివరి రోజైన 10వ తేదీ మాత్రమే

గుంటూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు శుక్రవారం రోజున 11మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు చివరి రెండురోజులు కావడంతో శుక్రవారం పెద్దసంఖ్యలో అభ్యర్థులు, వారి మద్దతుదారులు గుంటూరు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. దీంతో కలెక్టరేట్ పరిసరాలు, ప్రాంగణం లోపల కోలాహలంగా మారింది. పోలీసులు కలెక్టరేట్ గేటు వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేసి కేవలం అభ్యర్థులు, వారి పేరుని ప్రతిపాదించే, బలపరిచే ఓటర్లను మాత్రమే లోనికి అనుమతించారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు అందుబాటులో ఉండి నామినేషన్లను అభ్యర్థుల నుంచి స్వీకరించారు. శుక్రవారం ఎన్‌డీఏ కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, కందుల వెంకటరావు, చుండూరు సత్య బాలసుందరరామశర్మ, లగడపాటి వేణుగోపాల్, జాలాది అనిల్‌కుమార్, జూపూడి శ్యాంప్రసాద్, యెండ్రెడ్డి శివారెడ్డి, మంత్రి బాలకృష్ణ, మేరిగ మోహనరావు, మురకొండ చంద్రశేఖర్, గంటా మమత నామినేషన్లు దాఖలు చేశారు. కాగా శని, ఆదివారం ప్రభుత్వ సెలవుదినాలు కావడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నామినేషన్లను స్వీకరించబోమని ఆర్‌వో నాగలక్ష్మి తెలిపారు. నామినేషన్ల దాఖలుకు గడువు సమయం ఈ నెల 10వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3గంటల వరకు ఉందన్నారు. నిర్ణీత సమయం లోపు కలెక్టరేట్ ప్రాంగణంలోకి ప్రవేశించిన వారి నామినేషన్లను స్వీకరిస్తామన్నారు.

# నైపుణ్యాన్ని పెంపొందించుకుంటేనే మెరుగైన భవిష్యత్

● గుండె వైద్య నిపుణులు డాక్టర్ నాగశ్రీహరిత
● భాష్యం బ్లూమ్స్‌లో ఘనంగా సాంస్కృతిక ఉత్సవాలు



మాట్లాడుతున్న డాక్టర్ నాగశ్రీహరిత


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ నాగశ్రీహరిత అన్నారు. శుక్రవారం భాష్యం బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో హూప్లా పేరుతో ప్రారంభమైన కల్చరల్ డే వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. డాక్టర్ నాగశ్రీహరిత మాట్లాడుతూ కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న నేటి సాంకేతిక యుగంలో పిల్లలు సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారుతున్నారని, ఈ నేపథ్యంలో తల్లితండ్రులు పిల్లల్ని పర్యవేక్షించాలని సూచించారు. సామాజిక బాధ్యత, నైతిక విలువల్ని నేర్పించి భావి పౌరులుగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాలని అన్నారు. భాష్యం బ్లూమ్స్ పూర్వ విద్యార్థి డాక్టర్ సాయిఈశ్వర్ చౌదరి ప్రసంగిస్తూ ఇక్కడ విద్యనభ్యసించి తిరిగి ఇదే పాఠశాలకు అతిథిగా రావడం తనకు ఎంతో మరపురాని జ్ఞాపకమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా భాష్యం విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. భాష్యం విద్యా సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు మాట్లాడుతూ ఆధునిక విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తూ నూతన బోధన పద్ధతుల ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ విద్యనందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. సభకు భాష్యం మెడెక్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం అతిథుల చేతులమీదుగా విద్యార్థులకు బహుమతుల ప్రదానం నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం బ్లూమ్స్ ప్రైమరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవిత, సెకండరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ గిరిజారాణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని భాష్యం బ్లూమ్స్ జెడ్ ఈవో వరలక్ష్మి పర్యవేక్షించారు.

# పశువులకు.. నైట్రేట్ ముప్పు

(5వ పేజీ తరువాయి)

(పార్ట్ పర్ మిలియన్) నుంచి 540 పీపీఎం ఉన్నట్లు తేలింది. తెనాలి ప్రాంతంలో నీటిలో ఎక్కువ శాతం నైట్రేట్ ఉన్నట్లు వెటర్నరీ బయోలాజికల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వెల్లడించిన నివేదికలో తేలింది. పశుసంవర్థక శాఖ లెక్కల ప్రకారం పశువులు తాగే నీటిలో నైట్రేట్ 100 పీపీఎం మాత్రమే ఉండాలి. అది దాటితే సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గటం, కిడ్నీ విఫలం కావటం, చివరకు మరణిస్తాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు సందర్భంగా అన్ని గ్రామాల్లో నీటి నమూనాలు సేకరించాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటివరకు 21 నీటి నమూనాలు సేకరించి విజయవాడ ల్యాబ్‌కు పంపినట్లు వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల ఏడీఏ బి.మాధవి తెలిపారు.

యజమానులు అప్రమత్తం కావాలి

కొన్ని ప్రాంతాల్లో సేకరించిన నీటిలో నైట్రేట్ శాతం ఎక్కువగా ఉన్నట్లు రిపోర్టు వచ్చిన మాట వాస్తవమే. పశువులు తాగే నీటిలో నైట్రేట్ శాతం పెరిగితే అది అనేక రకాల దుష్పరిణామాలకు దారితీస్తుంది. పశువుల ఆరోగ్యం క్రమేపీ క్షీణిస్తుంది. కాబట్టి యజమానులు అప్రమత్తం కావాలి. పశువులు తాగడానికి సురక్షితమైన నీటిని మాత్రమే వినియోగించాలి. పశువుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అశ్రద్ధ చేయకుండా పరీక్షలు జరిపిస్తూ ఉండాలి.



- ఓ నరసింహారావు, పశుసంవర్థక శాఖ అధికారి, గుంటూరు జిల్లా

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



## మూల్యాంకన కేంద్రం ఏర్పాటుకు భవనాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల మూల్యాంకనం కేంద్ర ఏర్పాటుకు నరసరావుపేటలో భవనాలను ఆర్‌జేడీ.. సీవోఈ వీవీ సుబ్బారావు గురువారం రాత్రి పరిశీలించారు. మూల్యాంకనంపై మల్లగుల్లాలు అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై అయన స్పందించారు. మూల్యాంకనం కేంద్రం ఏర్పాటుకు ఎస్ఎస్ఎన్ కళాశాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు. కేంద్రం ఏర్పాటుకు సదరు కళాశాల నిర్వాహకులు సానుకూలంగా స్పందించారు. ఎస్ఎస్ఎన్ కళాశాలో మూల్యాంకనం నిర్వహించాలని ఆర్‌జేడీ నిర్ణయించారు. కళాశాలలో కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.




### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నాదెండ్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు - కర్నూలు రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గేదెల కాపరి బంటుపల్లి వీరలక్ష్మి (59) అనే మహిళ శుక్రవారం మృతిచెందింది. ఆమెతో పాటు ఒక దూడ మృతి చెందగా గేదె తీవ్రంగా గాయపడింది. సాతులూరు గ్రామానికి చెందిన వీరలక్ష్మి శుక్రవారం గేదెలను మేపేందుకు గుంటూరు రోడ్డు వైపు వెళ్తుండగా రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో వినుకొండ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరలక్ష్మి అక్కడికక్కడే మృతిచెంది. దూడ మృతి చెందగా గేదె తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నాదెండ్ల ఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఏడుగురు జూదరుల అరెస్టు

ఇస్సపాలెం (నరసరావుపేట రూరల్), ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి ): మండలంలోని ఇస్సపాలెంలో పేకాట శిబిరంపై నరసరావుపేట రూరల్ పోలీసులు దాడిచేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుండి రూ 4,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

### యడ్లపాడు మండలంలో నలుగురు..

యడ్లపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం కారుచోల-ఉన్నవ గ్రామాల మధ్య ఉన్న యూకలిప్టస్ తోటలో పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ సుబ్బనాయుడు తెలిపారు. రూరల్ యడ్లపాడు ఎస్ఐ వి.బాలకృష్ణ సిబ్బందితో కలసి శుక్రవారం దాడులు నిర్వహించి, పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12,100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

### కూలీల ఆటోను ఢీకొన్న లారీ: ఐదుగురు కూలీలకు గాయాలు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట - నరసరావుపేట ప్రధాన రహదారిపై మిరపకాయలు కోతకు వెళ్తున్న కూలీల ఆటోను వెనుక వైపు నుంచి లారి ఢీ కొన్న సంఘటన శుక్రవారం ఉదయం జరిగింది. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన మహిళలు నాదెండ్ల మండలం ఇర్లపాడులో మిరప కాయలు కోసేందుకు ఆటోలో వెళ్తుండగా నరసరావుపేట మండలం కేశానుపల్లి పంచాయతీ పరిధిలో చిలకలూరిపేట రోడ్డులో ఆటోను లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 15మంది మహిళల్లో ధనలక్ష్మి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మరో నలుగురు మహిళలకు స్వల్పంగా గాయాలయమ్యాయి. గాయపడిన వారిని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ పి.రామకృష్ణ, రూరల్ ఎస్ఐ కిషోర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

### డివైడర్‌ను ఢీకొని వ్యక్తికి గాయాలు

రొంపిచర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల నుంచి సంతగుడిపాడు వెళ్ళే రహదారిలో శుక్రవారం ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. కొత్తపల్లి గ్రామానికి చెందిన క్రాంతి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో గాయాలు అవ్వటంతో 108 అంబులెన్స్‌లో నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## వైద్య వృత్తికి నర్సింగ్ వెన్నెముక వంటిది

● డాక్టర్ చెన్నారెడ్డి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వైద్యవృతికి నర్సింగ్ వెన్నెముక వంటిదని డాక్టర్ డీ చెన్నారెడ్డి అన్నారు. శుక్రవారం పీఎన్‌సీ, కేఆర్ నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం నర్సింగ్ విద్యార్థుల ఫేర్‌వెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ డీ చెన్నారెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట మెడికల్ హబ్ అని, నర్సింగ్‌కు మంచి భవిష్యత్తు ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాసప్రసాదు, కళాశాల ప్రిన్సిపాల్ డీ గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ బీ సుజికల్పనా తదితరుల ప్రసంగించారు.

## కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో వ్యాపారాలపై అవగాహన

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలో ఇండస్ట్రియల్ అవేర్నెస్ కార్యక్రమం జరిగిందని నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో ఉద్యోగాలపై ఆధారపడకుండా సొంత ఆలోచనతో వ్యాపారాన్ని ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో రాము, టీడీవో ఎం బాలకోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మేజరు కాలువలకు మహర్దశ



చెంఫీజ్‌ఖాన్‌పేట వద్ద కంపచెట్లతో మూసుకుపోయిన కొండవీడు మేజరు (ఫైల్ ఫొటో)

యడ్లపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ళ పాలనలో కాలువలకు మరమ్మతులు నిర్వహించకపోవడంతో కాలువలు రూపురేఖలు మారిపోయాయి. కాలువకు ఇరువైపులా, లోపల కంపచెట్లు, నాచు దట్టంగా పెరిగి పూడుకుపోయాయి. దీనితో కాలువల చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వాగులు, చెరువుల నుంచి ఆయిల్ ఇంజన్ల ద్వారా పంటలకు తడులు పెట్టుకోవాల్సి వచ్చింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువల మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టింది. పిరంగిపురం మండలం వేములూరిపాడు వద్ద మొదలై యడ్లపాడు వరకు సుమారు 11కి.మీల పొడవైన కొండవీడు మేజరు కాలువలో పూడికతీత, కట్టలపై ఉన్న కంపచెట్లు తొలగింపు పనులను చేపట్టారు. కాలువ మరమ్మతులకు ప్రభుత్వం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ నిధులు రూ.10లక్షలు మంజూరు చేయడంతో కంపచెట్లు తొలగింపు, పూడికతీత పనులను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌పీ ఏఈ నందిని తెలిపారు. గత ఐదేళ్ళుగా ఆయకట్టుకు నీరందక ఇబ్బందులు పడిన రైతులు కాలువలకు మరమ్మతులు నిర్వహిస్తుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కంపచెట్లు తొలగించిన తరువాత చెంఫీజ్‌ఖాన్‌పేట వద్ద కొండవీడు మేజరు

# కౌన్సిలర్ల గురించి మాట్లాడే అర్హత బొల్లాకు లేదు

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాలుగు పార్టీలు మారి, ఫిరాయింపులు చేసిన బొల్లాకు కౌన్సిలర్ల గురించే మాట్లాడే అర్హత లేదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ మాజీ ఎమ్మెల్యే, నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వినుకొండ పట్టణంలో రఫీ హత్యకు కారణం బొల్లానేనని, రౌడీయిజాన్ని అణిచివేసి ఉంటే రఫీ మృతిచెందేవాడు కాదన్నారు. గతంలో బొల్లా హయాంలో వేసిన వెంచర్ల గురించి తెలియదా అని ప్రశ్నించారు. బొల్లా భాగస్వామ్యంతో వేసిన వెంచర్లలో డీటీసీ అప్రూవల్ ఉన్నాయా అని నిలదీశారు. నాలుగు లక్షల భూమిని రూ.18లక్షలకు ప్రభుత్వానికి అమ్మిన బొల్లా జైలుకు పోవడం ఖాయమన్నారు. నూతనంగా పార్టీలో చేరిన కౌన్సిలర్ల గౌరవాన్ని ఎక్కడ తగ్గించమని, అభివృద్ధిని చూసి పార్టీలో చేరిన కౌన్సిలర్లకు, 18వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన నాయకులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం, జీవీపై నమ్మకంతో కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారని, పట్టణ అభివృద్ధి జీవితోనే సాధ్యమని నమ్మి కౌన్సిలర్లు టీడీపీలో చేరుతున్నారన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

### ఆలపాటిని గెలిపించుకుందాం: జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఆంధ్ర రాష్ట్రానికి జగన్ చేసిన నష్టం, విధ్వంసం చక్కదిద్దే బాటలోనే కూటమిపాలన సాగుతుందని వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం గుంటూరు కలెక్టరేట్‌లో నామినేషన్‌వేసిన సందర్భంగా జీవీ ఆంజనేయులు పాల్గొని రాజేంద్ర ప్రసాద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు నెలలుగా రాష్ట్రంలోని వ్యవస్థలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గాడిలో పెడుతున్నారన్నారు. లక్ష కోట్ల పెట్టుబడులు లక్షలాది ఉద్యోగాలు వస్తున్న తరుణంలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలిపించడానికి పట్టభద్రులంత సంసిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే నక్క ఆనందబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చదలవాడ అరవిందబాబు, భాష్యం ప్రవీణ్, గల్లా మాధవి, నజీర్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు మక్కెన మల్లికార్జునరావు, ఉండవల్లి శ్రీదేవితోపాటు కూటమి నేతలు పాల్గొన్నారు.

# తిరునాళ్ళ ఏర్పాట్లపై నిర్లక్ష్య వైఖరిని వీడండి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో శివరాత్రి పర్వదినాన జరగనున్న తిరునాళ్ళ ఏర్పాట్లలో నిర్లక్ష్య వైఖరిని వీడాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. నరసరావుపేట పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కోటప్పకొండ తిరునాళ్ళకు 15రోజుల సమయం మాత్రమే ఉందన్నారు. . కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్లపై కూటమి ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా దుయ్యపట్టారు. ఇంతవరకు తిరునాళ్ళ ఏర్పాట్లపై రెండు సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేశారని, మొదటి సమీక్షలో కలెక్టర్, ఎస్పీ హాజరు కాలేకపోయారని, రెండో సమీక్షలో ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున అధికారులు మాత్రమే సమీక్షలో పాల్గొని సమావేశాన్ని ముగించారన్నారు. కోటప్పకొండలో తిరునాళ్ళలో సుమారు 20లక్షల మంది సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారన్నారు. కోటప్పకొండకు వెళ్లే రోడ్లు గాని లింకు రోడ్ల పనులు గానీ ఎక్కడా ప్రారంభించలేదన్నారు. అవిశాయపాలెం - గురవాయపాలెం రోడ్డుకు నాలుగు కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికి ఇంతవరకు టెండర్ పిలవలేకపోయారని, ఈ నిధులు మంజూరుచేసి నాలుగు నెలలు అయినప్పటికీ కనీసం టెండర్లు పిలిచి, జీవో తెప్పించుకోవడంలో ఎందుకు ఇంత ఆలస్యం జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతిరోజు మంత్రులను, ముఖ్యమంత్రిని కలుస్తూనే ఉన్నా ఈ జీవోను ఎందుకు విడుదల చేయించుకోలేకపోయారన్నారు. కానీ టెండర్ లేకుండానే అవిశాయపాలెం - గురువాయపాలెం రోడ్డు తవ్వి వేశారన్నారు. కలెక్టర్ విచారణచేసి ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్విన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా గురవాయపాలెం, కాలువ కట్ట రోడ్డు పూర్తిగా పాడైపోయి ఉందన్నారు. ఈ రోడ్డుపై ఎమ్మెల్యే బంధువులు, మట్టి తోలుకునే టిప్పర్లు, లారీలు ప్రతిరోజు ఈ రోడ్డుపై వందల సంఖ్యలో రాకపోకలు సాగించటం వల్ల రోడ్డు అంతా పాడైపోయిందన్నారు. అదేవిధంగా కోటప్పకొండకు ఉన్న లింకు రోడ్లన్నిటిని తక్షణమే బాగు చేయాలని డిమాండ్ చేశారు. తాగునీటి విషయానికి వస్తే శంభు లింగం చెరువు, ఎర్ర చెరువులో నీళ్ల లేవన్నారు. ప్రభుత్వం వచ్చి 8 నెలలైనా అయిందనీ, కోటప్పకొండ ఆదాయం సుమారు కోటి రూపాయల వరకు ఉంది కానీ, ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టడం లేదన్నారు. మూడు నెలల ముందు పనులు ప్రారంభిస్తే గాని ఈ తిరునాళ్ల పనులు పూర్తి కావన్నారు. కోటప్పకొండ తిరునాళ్ళ ఏర్పాట్లను అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమష్టి కృషితో విజయవంతం చేయాలని కోరారు.

## కండువాలు కప్పినంత మాత్రాన మీ కౌన్సిలర్లు కారు

● మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో పార్టీ గుర్తుపై గెలిచినప్పుడే మీ కౌన్సిలర్లు అవుతారని, ఒక పార్టీలో గెలిచి మరోపార్టీ కండువా కప్పుకున్నంత మాత్రాన వారు మీ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కారని మాజీ శాసన సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను మోసంచేసి ఓట్లు వేయించుకున్నారని ఎమ్మెల్యే జీవీని ఉద్దేశించి విమర్శించారు. మాల్యాద్రి ఆగ్రో టెక్ నుంచి కొన్న భూముల్లో ఇప్పటికే నా ఫ్యాక్టరీ ఉందని, నా ఫ్యాక్టరీ ద్వారా వందలాది మందికి ఉపాధి కల్పిస్తున్నానన్నారు. కొనుగోలుచేసిన భూముల్లో ప్రభుత్వ భూములు ఉంటే తీసుకోవచ్చని ఈ సందర్భంగా సవాల్‌చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఎవరికి పట్టం కడతారో చూద్దామని, మీ బెదిరింపులకు భయపడేది లేదన్నారు. కొండపైకి ఎక్కిన చీఫ్‌విప్ రాళ్లు గుడులమీద పడుతున్నాయని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో ఆలయ నిర్మాణానికి మూడు కోట్లు రూపాయలు చందాలు కమిటీ వద్ద ఉన్నాయని, దానిలో రూ.90లక్షలు తాను ఇచ్చిన విరాళం కూడా ఉందన్నారు. గతంలో కొండపై ఉన్న రోడ్డును ప్రజలు చూశారని, ఇప్పుడు మీరు కొండపై రోడ్డు లేదంటే ఎలా అని నిలదీశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు అమ్మిరెడ్డి అంజిరెడ్డి, తుపాకుల కొండలరెడ్డి, వైసీపీ నాయకులు యంయన్ ప్రసాద్, పగడాల వెంకటరామిరెడ్డి, రాజా, దండు చెన్నయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్లు తెల్లాకుల రాజేష్, బేతం గాబ్రియేలు తదితరులు ఉన్నారు.

### వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మాఘమాసం వ్రతాలు

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో మాఘమాసం సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస, శ్రావణ్‌కుమార్‌లు వ్రత పూజలు జరిపించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు భాగవతుల రవికుమార్, పవన్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి బంగారయ్య, కాళ్ళ కోటేశ్వరరావు, ఎ.కృష్ణ, వాసు, జి.ఘంటారావు, సుబ్బారావు, పువ్వాడ అరవింద్, అప్పలరాజా, నాగలక్ష్మి, సురేఖ, సత్సంగం సభ్యులు సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, సుబ్బయ్యపాలెం, బుచ్చిపాపన్నపాలెం, మర్రిచెట్టుపాలెం, సుబ్బయ్యపాలెం గ్రామాల సబ్ స్టేషన్‌ల పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ కే రాంబాబు శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్ళలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపి వేస్తామన్నారు. మూడో ఫేజ్ కరెంటు శనివారం అర్ధరాత్రి 12గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

● బొల్లాపల్లి: మండలంలోని బండ్లమోటు పరిధిలోని బొల్లాపల్లి, రేమిడిచర్ల, వెల్లటూరు, గుట్లపల్లి, పలుకూరు తదితర గ్రామాల్లో రెండో శనివారం నేపథ్యంలో మరమ్మతులు దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

### ఉమ్మడివరంలో గడ్డివామి దగ్ధం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మడివరంలో గడ్డివామి దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వీరగంధం రామ్మూర్తికి చెందిన రూ.లక్ష విలువ చేసే గడ్డి దగ్ధమైంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. దీనిపై గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు.

## ప్రజా సంఘాలు ఏకతాటిపైకి రావాలి: కేఎస్ లక్ష్మణరావు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై స్పష్టమైన అవగాహనతో నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్ళే పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపుకోసం అన్ని ప్రజా సంఘాలు ఏకతాటి పైకి రావాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఎన్నికల ప్రచారంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థిగా ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా, ఉద్యమ సంఘాలు బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ నెల 10వ తేదీన నామినేషన్ వేయనున్నానన్నారు. కార్యక్రమంలో గద్దె చలమయ్య, ముజఫర్ అహ్మద్, కట్టా కోటేశ్వరరావు, డీ శివకుమారి, ఎస్ ఆంజనేయనాయక్, సిలార్ మసూద్ తదితరులు పాల్గొన్నారు.

### చీటింగ్ కేసులో వ్యాపారి లొంగుబాటు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సుమారు రూ.1.91 కోట్ల మేరకు చీటింగ్ చేసిన కేసులో నిందితుడైన పట్టణంలోని మహేశ్వరి మెడికల్ కార్పొరేషన్, మాతృశ్రీ మెడికల్ కార్పొరేషన్ నిర్వాహకుడైన చందోలు వెంకట నరసింహారావు అలియాస్ రాంబాబు శుక్రవారం స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టులో లొంగిపోయాడు. దీంతో నిందితుడికి రిమాండ్ విధిస్తూ ఇన్‌చార్జి న్యాయాధికారి ఆర్ ఆశీర్వాదంపాల్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కేసు వివరాలు చూస్తే.. మెడికల్ షాపులో లాభాలు బాగా వస్తాయని నమ్మించిన రాంబాబు పట్టణంలోని పాతూరుకు చెందిన అర్చకుడు మేళ్లచెరువు సాంబశివశాస్త్రి నుంచి రూ.41 లక్షలను పెట్టుబడిగా 2021 జనవరి 18 తీసుకుని వ్యాపారంలో భాగస్వామిని చేశాడు. ఆ తర్వాత సాంబశివశాస్త్రి ఇంటిపై రాంబాబు ఒకటిన్నర కోటి రుణం తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని మహేశ్వరి మెడికల్ కార్పొరేషన్‌కు తరలించి, అతడ్ని సంస్థ నుంచి తొలగించాడు. ఆడిటర్ ద్వారా ఈ విషయం తెలుసుకున్న సాంబశివశాస్త్రి రాంబాబు, అతడి కుమారుడు, కుటుంబ సభ్యులపై మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్లో గత ఏడాది జూలై 10న ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తుండగా నిందితుడు కోర్టులో లొంగిపోయాడు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని డ్రైవర్ కాలనీలో నివాసం ఉంటున్న ఆలకుంట సుబ్బారావు (60) శాలివాహన నగర్‌లో నివాసం ఉంటున్న కుమారుడు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా గుర్తు తెలియని టిప్పర్ ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రవణమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### గుండె ఆపరేషన్‌కు రోటరీక్లబ్ ఆర్థికసాయం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి గుండె ఆపరేషన్ కోసం శుక్రవారం రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు శ్రీకాంతరెడ్డి మాట్లాడుతూ దర్శి పట్టణానికి చెందిన ఐనకోల ఇస్రాయేలు, మేరీ దంపతులకు గుండె ఆపరేషన్ అవసరమని వైద్యులు తెలిపారని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రోటరీ మిత్రుల సాయంతో రూ.20వేలు ఆర్థికసాయం అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ఏరువ వెంకటనారాయణ, మస్తాన్‌వలి, చిరుమామిళ్ళ కోటేశ్వరరావు, యంవీ రామన్, బత్తుల శ్రీనివాసరావు, ఆళ్ళ శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, వెంకటేశ్వర రెడ్డి, ఎం.రమేష్, రాజారెడ్డి, నవీన్, శ్రీనివాసరావు, రాయుడు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పుల్లారావు

## నాణ్యతలో రాజీ లేకుండా పనులు చేయాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నాణ్యతలో రాజీ పడకుండా పనులు నిర్వహించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఇర్లపాడు గ్రామ పరిధిలోని కేంద్రీయ విద్యాలయం వద్ద రూ.40లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రెయినేజ్ నిర్మాణ పనులు, రూ.60 లక్షలతో నిర్మిస్తున్న షైనంపాడు మెటల్ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసే పనులు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి మంచి పేరు వచ్చేలా నిర్మాణ పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యతలో లోపం లేకుండా నిర్ణీత వ్యవధిలోనే నిర్మాణ పనులు చేయాలని కోరారు. ఆయనతో పాటు జనసేన ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్, పార్టీ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, నాయకులు వి.సింగయ్య, ఖాజా మొహిద్దీన్, పచ్చవ మోహన్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి పొందిన ఎడ్లజత

## ముగిసిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

నాదెండ్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల నందికుంట విఘ్నేశ్వర స్వామి దేవాలయ సమీపంలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఒంగోలు జాతి వృషభ రాజముల బల ప్రదర్శన పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఆఖరి రోజున జూనియర్స్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష్‌చౌదరి, శివకృష్ణ చౌదరిలతో పాటు ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం ఖాజీపేటకు చెందిన ఓసూరారెడ్డిల కంబైన్డ్ ఎడ్ల జత 3250 అడుగులు బండ లాగి ప్రథమ, కడప జిల్లా పొద్దుటూరు మండలం కల్లూరుకు చెందిన శివకృష్ణ యాదవ్ ఎడ్ల జత 3060 అడుగులు ద్వితీయ, కృష్ణా జిల్లా హనుమాన్ సంక్షన్‌కు చెందిన కేతినీడి తేజోమూర్తి జత 2828 అడుగులతో తృతీయ స్థానంలో నిలిచాయి. వరుసగా అత్తోట శిరీష, శివకృష్ణ చౌదరిలకు చెందిన జత 2568 అడుగులు, చల్లపల్లి మండలం నాదెండ్లవారిపాలెంకు చెందిన కాకర్ల సురేష్ బాబు జత 2,500 అడుగులు, పెదనందిపాడు మండలం నాగులపాడుకు చెందిన ఆలా మోహనరావు, పాటిబండ్ల శ్రీనివాసరావుల జత 2365 అడుగులు, నరసరావుపేట మండలం పమిడిమర్రుకు చెందిన ఎర్రసాని సుబ్బయ్య జత 2250 అడుగులు, గుంటూరుకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు జత 2060లు లాగాయి. వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, తంగెడ హసన్‌లు వ్యవహరించారు.

## అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి: ప్రజా సంఘాలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం ములకలూరు సమీపంలో విజయలక్ష్మి టౌన్‌షిప్ వేద మెడోస్, విజయలక్ష్మి టౌన్ షిప్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో ప్రజా సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ములకలూరు, గోళ్ళపాడు మధ్యలో అనేక వెంచర్లలో వీరు వాగులు, పంట కాలువలు, ఎన్ఎస్‌పీ కాలువలు సైతం ఆక్రమించి వెంచర్లు వేశారన్నారు. అంతేకాకుండా సాయిసాధన చిట్‌ఫండ్ కంపెనీ పేరుతో పెద్ద ఎత్తున ప్రజా సంపదను పోగుచేసుకొని ఎండీ పీ పుల్లారావు పారిపోయాడని ఆరోపించారు. అక్రమంగా వెంచర్ల వేసి రిజిస్ట్రేషన్ కార్యాలయం సహకారంతో రిజిస్ట్రేషన్లు చేయడం, ఇంకా అనేక మంది వడ్డీ వ్యాపారులతో కలిసి ప్రభుత్వాస్తులు కొల్లగొడుతూ, మరోవైపు వినియోగదారులను మోసం చేస్తున్నారని విమర్శించారు. పీ పుల్లారావు, గుండా సాంబశివరావు, వీరికి సహకరించిన స్టాంపు రైటర్‌పై, వారి ఆస్తులపై, వారి అక్రమ సంపాదనపై దర్యాప్తు జరిపి వారి ఆస్తులు స్వాధీనం చేసుకోవాలన్నారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించి, పంట కాలువలు, వాగుల్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ, వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ శిఖినం చిన్న, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నూరుశాతం స్వచ్ఛతను సాధించడమే లక్ష్యం

● అసిస్ట్ డైరెక్టర్ డాక్టర్ రంగారావు

యడ్లపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నూరుశాతం స్వచ్ఛత సాధించడమే లక్ష్యంగా స్వచ్ఛంద సేవా సంస్థలు పనిచేస్తున్నట్లు అసిస్ట్ డైరెక్టర్ డాక్టర్ జాస్తి రంగారావు అన్నారు. ఐటీసీ బంగారు భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యడ్లపాడు మండలం లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐటీసీ, అసిస్ట్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్వచ్ఛత, మౌలిక వసతుల కల్పన, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈవో నాగరత్నం అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంలో పాఠశాలల ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్తులో ఆయా పాఠశాలల్లో చేయవలసిన మార్పులు, స్వచ్ఛత నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్ట్ డైరెక్టర్ డాక్టర్ రంగారావు మాట్లాడుతూ లింగారావుపాలెం జడ్పీ హైస్కూల్‌ను మోడల్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరామిరెడ్డి, అసిస్ట్ డిప్యూటీ డైరెక్టర్ పావులూరి రవిబాబు, కో-ఆర్డినేటర్లు డేవిడ్, వెంకయ్య, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

### అనంతలక్ష్మి నూలు మిల్లులో కార్మికులకు క్రీడా పోటీలు

యడ్లపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపాలెం గ్రామ పరిధిలోని అనంతలక్ష్మి నూలు మిల్లులో వార్షిక కార్మిక క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ వి.బాలకృష్ణ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అనంతలక్ష్మి యాజమాన్యం కార్మికుల ఆరోగ్యం, సంక్షేమంపై తీసుకుంటున్న శ్రద్ధ ఎంతో అభినందనీయమన్నారు. మిల్లు ఈడీ సామినేని ఫణికుమార్ మాట్లాడుతూ కార్మికులలో క్రమశిక్షణ, సుహృద్భావ వాతావరణం పెంపొందించే ప్రణాళికలో భాగంగా ప్రతి ఏటా క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వాలీబాల్, షాట్‌పుట్, షటిల్ బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్స్, త్రోబాల్, టెన్నీకాయిట్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మిల్లు డైరెక్టర్ బి ప్రసాద్, జీఎం వెంకటేశ్వరరావు, మిల్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

### మిర్చిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

యడ్లపాడు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం తిమ్మాపురంలో మిరప సాగులో చేపట్టవలసిన సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఉద్యానశాఖ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.నగేష్ పాల్గొని మిర్చి పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ళు గురించి వివరించారు. చిలకలూరిపేట ఉద్యాన అధికారి వి.విశాల్ ఉద్యాన శాఖలో అమలవుతున్న పథకాలు, రాయితీ, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రాధాన్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకురాలు షేక్ ఆయేషా, రైతులు పాల్గొన్నారు.